Follow: @ANNTELUGU
ANN తెలుగు
05-11-2025
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 317 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## హైదరాబాద్‌కు పెట్టుబడుల వెల్లువ

### అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రాజెక్టుల విస్తరణ

డ్యుయిష్ బోర్స్ కంపెనీ జీసీసీ.. వెయ్యి మందికి ఉద్యోగాలు

సీఎంతో కంపెనీల ప్రతినిధులు భేటీ

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌ను ఇన్నొవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడంలో తెలంగాణ ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్మనీకి చెందిన ప్రతినిధి బృందాన్ని కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని, ప్రధానంగా ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగాల్లో జర్మనీ కంపెనీల పెట్టుబడులు పెట్టాలని కోరారు. జర్మనీ కాన్సులేట్ జనరల్ (చెన్నై) కాన్సుల్ జనరల్ మైఖేల్ హోస్పర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రితో భేటీ అయింది. జర్మనీకి చెందిన ప్రముఖ బహుళజాతి సంస్థ డుయిష్ బోర్సా విస్తరణలో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి వివరాలను అందించారు. తాజాగా డుయిష్ బోర్సా కంపెనీ ఏర్పాటు చేస్తున్న జీసీసీ ద్వారా వచ్చే రెండేళ్లలో ఐటీ రంగంలో వెయ్యి

మిగతా 2లో

టాప్ న్యూస్



### అజారుద్దీన్‌కు మైనారిటీ సంక్షేమ శాఖ

- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

02



### లాలూ కొడుకు సీఎం సోనియా కొడుకు పీఎం కాలేరు

- బీహార్‌లో అమిత్ షా సెటైర్లు


02



### బిగ్‌బాస్‌కు వెళ్లినందుకు నా చెప్పుతో నేనే కొట్టుకోవాలి

- యాంకర్ విష్ణుప్రియ కామెంట్స్

02



## చేవెళ్ళ రోడ్డు ప్రమాదంపై హెచ్‌ఆర్ సీ సీరియస్

### సుమోటోగా కేసు నమోదు... నోటీసులు జారీ

**హైదరాబాద్, మహా :** చేవెళ్ళ రోడ్డు ప్రమాదంపై మానవ హక్కుల కమిషన్ సీరియస్ గా స్పందించింది. సూమోటోగా కేసు నమోదుచేసింది. సోమవారం తెల్లవారుజామున చేవెళ్ళ రోడ్డులోని మీర్జాగూడ దగ్గర ఆర్టీసీ బస్సును కంకర టిప్పర్ ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 19 మంది కంకరలో కూరుకుపోయి ఊపిరి ఆడకుండా చనిపోయారు.

మిగతా 2లో



### మీది ఫెవికాల్ బంధం కాకుంటే..

# కేసీఆర్, హరీష్‌లను ఈనెల 11లోగా అరెస్ట్ చేయాలి

### కాళేశ్వరం కేసును సీబీఐకి పంపిస్తే.. 48 గంటల్లో తండ్రీ కొడుకులను జైలుకు పంపిస్తామన్నారు

ఎందుకు పంపట్లే.. కేటీఆర్ అరెస్ట్ కు ఎందుకు అనుమతి ఇవ్వట్లే?

మీ చీకటి ఒప్పందం వల్లే బీఆర్ఎస్ కు బీజేపీ పరోక్ష మద్దతు

బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫైర్

తండ్రీకొడుకులకు గుండెలు అదిరేలా నవీన్ కు 30వేల మెజారిటీ పక్కా

జూబ్లీహిల్స్ లో సర్వదరిద్రాలకు పదేళ్ళు మునిసిపల్ మంత్రిగా చేసిన ఆయనే కారణం



**హైదరాబాద్, మహా :** కేసీఆర్, హరీష్ రావులను సీబీఐ ఎప్పుడు అరెస్ట్ చేస్తుందో చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రహమత్ నగర్ డివిజన్‌లోని శ్రీరామ్ నగర్ క్రాస్ రోడ్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 30వేల మెజారిటీతో గెలవబోతున్నారని, ఈ గెలుపు చప్పుడు ఫామ్ హౌస్‌లో ఉన్న తండ్రీకొడుకులకు గుండెలు అదిరేలా వినిపించాలని ఆయన అన్నారు. కాళేశ్వరం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని బీజేపీ నేతలు పదే పదే చెప్పారని సీఎం రేవంత్ గుర్తు చేశారు. "కాళేశ్వరం కేసును సీబీఐకి పంపిస్తే 48 గంటల్లో తండ్రీ కొడుకులను జైలుకు పంపిస్తామన్నారు. మీరు, వాళ్లు ఒక్కటి కాకపోతే, బీఆరెస్, బీజేపీ ది ఫెవికాల్ బంధం కాకపోతే, ఈ నెల 11 లోగా కాళేశ్వరం కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ చేయాలి.

మిగతా 2లో

## ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై కమిటీ

### మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వానికి కమిటీ నివేదిక

స్పెషల్ చీఫ్ సెక్రటరీతో పాటు 15 మందితో ఏర్పాటు

ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరామ్‌లకు కమిటీలో చోటు

**హైదరాబాద్, మహా:** ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి సంస్కరణలపై కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీతో పాటు 15 మందితో ఈ కమిటీని నియమించింది. ఇక కాలేజీల నుంచి ఈ కమిటీలో ముగ్గురికి చోటు కల్పిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఈ కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు కల్పించినట్లు స్పష్టం చేసింది. ఈ కమిటీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. అలాగే ప్రత్యేక ట్రస్ట్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. అయితే మూడు నెలల్లో ఈ కమిటీ నివేదిక అందజేయాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోలో క్లియర్ కట్‌గా సూచించింది. అలాగే విద్యా సంస్థలు స్పష్టం చేసిన సూచనలపై సైతం అధ్యయనం




చేయాలని ఈ సందర్భంగా కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.

**వాయిదాల రూపంలో నగదు చెల్లిస్తామంటూ..**

ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యం, ప్రభుత్వానికి మధ్య దూరం బాగా పెరుగుతోంది.

మిగతా 2లో



## రోడ్లు ఖరాబ్ ఉంటే యాక్సిడెంట్స్ కావు


- రోడ్లు ఎంత మంచిగుంటే అంత పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి
- ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** చేవెళ్ల బస్సు ప్రమాదంపై ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మరోసారి సంచలన కామెంట్స్ చేశారు.

మిగతా 2లో

## బీహార్‌లో ముగిసిన తొలి విడత ప్రచారం

### రేపే పోలింగ్



**మహా:** బీహార్ లో తొలి విడత అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రచార మైకులు మూగబోయాయి. తొలి విడతలో భాగంగా మొత్తం 18 జిల్లాల్లోని 121 అసెంబ్లీ స్థానాల్లో ఈ నెల 6న పోలింగ్ జరగనుంది. పోలింగ్ నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. బీహార్‌లోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. తొలి విడతలో 121 అసెంబ్లీ స్థానాలకు, రెండో విడతలో మిగతా 113 స్థానాల్లో పోలింగ్ జరుగనుంది. నవంబర్ 11న రెండో విడత పోలింగ్ నిర్వహించనున్నారు.



## మావోయిస్టులకు మరో బిగ్ షాక్

- సుక్మా అడవుల్లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ స్వాధీనం
- భారీ మొత్తంలో ఆయుధాలు సీజ్ చేసిన భద్రతా దళాలు

02

## సునీతా గోపినాథ్‌ను గెలిపించండి

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనను పోల్చుకుని ఓటేయండి
- రోడ్ షోలలో కేటీఆర్ పిలుపు





వివరాలు 2లో

### దార్శనిక పారిశ్రామికవేత్త

## ఇక లేరు

### హిందుజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ కన్నుమూత



**మహా:** ప్రముఖ వ్యాపార వేత్త, హిందుజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ పి హిందుజా (85) లండన్‌లో తుదిశ్వాస విడిచారు. వ్యాపార వర్గాల్లో జీపీగా పేరుగాంచిన గోపీచంద్ హిందూజా బ్రిటన్‌లోని అత్యంత ధనవంతులైన వ్యాపార వేత్తలలో ఒకరు. ఆయనకు భార్య సునీత, కుమారులు సంజయ్, ధీరజ్ కుమార్తె రీటా ఉన్నారు. గోపీచంద్ మరణంపై పలువురు పారిశ్రామికవేత్తలు, వ్యాపార దిగ్గజాలు సంతాపం ప్రకటించారు.

ప్రత్యేక కథనం 4లో

# రాజీ పడితే సహించేది లేదు

ఎత్తిపోతల పథకాల నిర్మాణాలలో ప్రమాణాలు పాటించాలి

నాణ్యత లోపం వెలుగుచూస్తే తీవ్ర పరిణామాలు తప్పవు

ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణకు రైతు కమిటీలు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణకు రైతు కమిటీలు ఏర్పాటు చేయాలని, కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ తో సహా చైర్మన్, వైస్ చైర్మన్ తో 10మందితో ఈ కమిటీలు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఇరిగేషన్ శాఖ మంత్రి ఎన్ .ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. హుజుర్ నగర్, కోదాడ నియోజకవర్గాలలో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాలపై మంగళవారం డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఎత్తిపోతల పథకాల నిర్మాణాలలో విధిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, రాజీ పడితే సహించేది లేదు అని హెచ్చరించారు.

మిగతా 2లో

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,22,460 |
| 22 క్యారెట్ | 1,12,250 |
| సిల్వర్ (కేజీ) | 1,51,000 |






## సునీతా గోపినాథ్‌ను గెలిపించండి

- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనను పోల్చుకుని ఓటేయండి
- రోడ్ షోలలో కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ ఎలక్షన్ జరుతున్నది కారుకు.. బుల్డోజర్‌కు మధ్యేనని, కాంగ్రెస్ గెలిస్తే ఇండ్లపైకి బుల్డోజర్ వస్తుందని.. ప్రజలను ఆదుకునే ఎవరూ ఉండరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమాజీగూడలో రోడ్‌షో నిర్వహించిన కేటీఆర్ ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రేవంత్‌రెడ్డి తుంగలో తొక్కాడని, విద్యార్థులకు ఇస్తామన్న విద్యా భరోసా కార్డు ఎక్కడికి వెళ్లింది? అంటూ నిలదీశారు. కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదన్న కేటీఆర్.. ఎస్సీ ఎస్టీ, మైనారిటీ, అగ్రవర్ణాల పేద పిల్లలు చదువుకు దూరమవుతున్నారన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వనోడు అభివృద్ధి చేస్తానంటే నమ్మాలా? అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధి, కాంగ్రెస్ రెండేళ్ల అరాచకాన్ని బేరీజు వేసుకొని కారు గుర్తుకు ఓటువేసి భారీ మెజారిటీతో సునీతా గోపినాథ్‌ను గెలిపించాలని కోరారు.

## రాజీ పడితే సహించేది లేదు

(మొదటిపేజీ తరువాయి)

నాణ్యత లోపం వెలుగుచూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు.

**అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదు..**

రైతాంగం కళ్లలో వెలుగులు నింపేందుకే ఎత్తిపోతల పథకాలు అని..ఇందులో అవక తవకలు జరిగితే ఉపేక్షించేది లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయకట్టు పెరుగుతుంది అనుకుంటే స్వల్ప మార్పులకు ఆదేశాలిస్తున్నామని, అదనపు నిధుల మంజూరికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణాల పురోగతిని నెల వారీగా వివరించాలన్నారు. నగదు చెల్లించిన భూములను సత్వరమే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఎత్తిపోతల పథకాల నిర్మాణాలపై ఆయకట్టు రైతాంగం పెంచుకున్న ఆశలు సాకారం కావాలంటే.. వాటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఉత్తమ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా హుజూర్ నగర్ నియోజకవర్గ పరిధిలోని మహాత్మాగాంధీ ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకంతో పాటు జవహర్ జానపహాడ్ బ్రాంచ్ కెనాల్, బెట్టే తండా, నక్క గూడెం, రాజీవ్ గాంధీ ఎత్తిపోతల పథకాల పురోగతితో పాటు, హుజూర్ నగర్ లో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖ కార్యాలయ భవన పురోగతిపై ఆయన సమీక్షించారు.

## అజారుద్దీన్ కు మైనారిటీ సంక్షేమ శాఖ

**ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్**

**హైదరాబాద్, మహా :** మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి మహ్మద్ అజహరుద్దీన్ కు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శాఖలను కేటాయించారు. గత నెల 31వ తేదీన అజహర్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం అజారుద్దీన్ కు సీఎం రేవంత్ రెండు శాఖలను కేటాయించారు. తాను చూస్తున్న పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖతో పాటు సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దగ్గరున్న మైనారిటీల సంక్షేమ శాఖను రెండింటిని అజర్ కు కేటాయించారు. పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్, మైనారిటీ శాఖలను మంత్రి అజహర్ కు కేటాయించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులను జారీచేశారు. మైనారిటీ మంత్రిత్వశాఖ కేటాయిస్తారని ముందునుండీ ప్రచారం ఉండగా, అదే కేటాయించారు.

## రోడ్లు ఖరాబ్ ఉంటే యాక్సిడెంట్స్ కావు

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రోడ్లు ఖరాబ్ ఉంటే ఏం యాక్సిడెంట్స్ కావు.. బండ్లు మెల్లగా పోతయ్.. రోడ్లు ఎంత మంచిగుంటే అంత పెద్ద ప్రమాదాలు జరుగుతాయన్నారు. 2016లో బీజాపూర్ జాతీయ రహదారి ప్రకటించారన్న ఆయన.. రియల్ ఎస్టేట్ కోసం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణ చేయలేదని.. కేవలం బీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. బస్సు ప్రమాదానికి కారణం వందకు వందశాతం గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణం అని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఇందుకు సబంధించిన ఆ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**మీది ఫెవికాల్ బంధం కాకుంటే..**

# కేసీఆర్, హరీష్‌లను ఈనెల 11లోగా అరెస్ట్ చేయాలి





(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్, హరీష్, కేటీఆర్ ని అరెస్ట్ చేయాలి. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ ను అరెస్ట్ చేసేందుకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదు.'' అని అన్నారు. ఇందులో మీ చీకటి ఒప్పందం ఏంటనీ ప్రశ్నించారు. ''చీకటి ఒప్పందం చేసుకుని జూబ్లీహిల్స్ లో బీజేపీ బీఆరెస్ కు పరోక్ష మద్దతు ఇస్తోంది. ఎందుకంటే. రాబోయే రోజుల్లో బీఆరెస్ బీజేపీ లో విలీనం అవుతుంది. ఇది నేను అంటున్నది కాదు.. వాళ్ల ఆడబిడ్డ చెబుతున్నదే'' అని తెలిపారు. జూబ్లీహిల్స్ లో చెత్త ఎందుకుంది? పదేళ్ళు మునిసిపల్ మంత్రిగా ఉన్న ఆ చెత్తనాకొడుకు ఏం చేశాడు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ లో సర్వదరిద్రాలకు, దుర్గంధాలకు ఆయనే కారణమని, అపుడు బెంజికార్లలో తిరిగి, ఇపుడు ఆటోల్లో గల్లీలు తిరుతుగున్నాడన్నారు. జన్వాడలో కేటీఆర్, మొయినాబాద్ లో హరీష్, శంకరపల్లి లో కవిత, గజ్వేల్ లో కేసీఆర్ లకు వందల ఎకరాల ఫామ్ హౌజ్ లు ఎలా వచ్చాయన్నారు. గత పదేళ్ళలో హైదరాబాద్ కు కేసీఆర్ చేసింది ఏమీ లేదన్నారు.

**బీఆర్ఎస్ నేతల 'సింపతీ' డ్రామా:**

“సిట్టింగ్ శాసనసభ్యుడు చనిపోతే, ఆయన సతీమణిని గెలిపించాలని అడుగుతున్నారు. కానీ ఇదే కేసీఆర్, 2007లో పేదల దేవుడు, దివంగత నేత పి. జనార్ధన్ రెడ్డి (పీజేఆర్) మరణించినప్పుడు ఏం చేశారు?” అని ప్రశ్నించారు. “ఆనాడు పీజేఆర్ రాజకీయ ప్రత్యర్థి అయిన చంద్రబాబు నాయుడు కూడా విజ్ఞత ప్రదర్శించి, ఏకగ్రీవానికి అంగీకరించి పోటీ పెట్టలేదు. కానీ కేసీఆర్ మాత్రం, సెంటిమెంట్ లేదంటూ పీజేఆర్ కుటుంబంపై అభ్యర్థిని నిలబెట్టారు. మద్దతు అడగడానికి వెళ్లిన పీజేఆర్ భార్యను, కుటుంబాన్ని మూడు గంటల పాటు గేటు బయట నిలబెట్టిన దుర్మార్గుడు కేసీఆర్,” అని రేవంత్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. పీజేఆర్ మీద పోటీ పెట్టినందుకు బీఆర్ఎస్ నేతలు రహమత్ నగర్ చౌరస్తాలో ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాకే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు.

**జూబ్లీహిల్స్ కు 4వేల ఇళ్ళు**

ఈ ఉప ఎన్నికలో ప్రచారం సందర్భంగా జూబ్లిహిల్స్ నియోజకవర్గానికి సీఎం రేవంత్ రెడ్డి భారీ కానుకు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే, ఎన్నికల తర్వాత జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి 4,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్న మిత్రపక్షాలైన ఎంఐఎం (అసదుద్దీన్ ఓవైసీకి ప్రత్యేక కృతజ్ఞతలు), సిపిఐ, సిపిఎం, కోదండరాం పార్టీలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. “ఆడబిడ్డను ఆదుకోవాలని కేటీఆర్ చెప్తున్నారు. కానీ తండ్రి సంపాదించిన ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లెల్నే మెడలు పట్టి బయటకు గెంటించిన కసాయి కేటీఆర్ కాదా?” అని నిలదీశారు. “సొంత చెల్లెలికే బుక్కెడు అన్నం పెట్టనోడు... ఇప్పుడు మరొకరిని ఆదుకుంటాడట,” అని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాలనలో ఐదేళ్ల పాటు మంత్రివర్గంలో ఒక్క మహిళకు కూడా స్థానం ఇవ్వని కేసీఆర్, కేటీఆర్‌లకు మహిళల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలకు నాయకత్వం ఇచ్చిందని, తమ మంత్రివర్గంలో సీతక్క, కొండా సురేఖ వంటి వారికి గౌరవం ఇచ్చిందని గుర్తుచేశారు.

**రేషన్ కార్డులు.. ఫ్రీ కరెంట్ .. ఉచిత బస్సు**

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జూబ్లీహిల్స్‌లోనే 14,159 కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని సీఎం తెలిపారు. “మేము 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తున్నాం, సన్న బియ్యం ఇస్తున్నాం, ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే, బీఆర్ఎస్ నాయకులు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ఆ పథకాన్ని ఆపాలని చూస్తున్నారు,” అని విమర్శించారు. “మీ రేషన్ కార్డు రద్దు చేయడానికా బీఆర్ఎస్‌ను గెలిపించేది? మీ ఉచిత కరెంట్ ఆపడానికా? ఆడబిడ్డల బస్సు ప్రయాణం ఆపడానికా?” అని ప్రజలను ప్రశ్నించారు. ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ , నేతలు పాల్గొన్నారు.

## చేవెళ్ళ రోడ్డు ప్రమాదంపై హెచ్ఆర్ సీ సీరియస్

**సుమోటోగా కేసు నమోదు... నోటీసులు జారీ**

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాదంపై మీడియా ఛానళ్ళు, దినపత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా కమిషన్ కేసు నమోదు చేసింది. రవాణా, రోడ్లు, భవనాల శాఖ, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలకు కమిషన్ నోటీసులు జారీ చేసింది. డిసెంబర్ 15వ తేదీలోగా ప్రమాదంపై సమగ్ర నివేదికను అందించాలని ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీసును కూడా నివేదికను సమర్పించాలని కమిషన్ ఆదేశించింది. ఇప్పటికే బస్సు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. డీజీపీ శివధర్ రెడ్డి తదితరులు ఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు.

## బిగ్‌బాస్‌కు వెళ్లినందుకు నా చెప్పుతో నేనే కొట్టుకోవాలి

**యాంకర్ విష్ణుప్రియ కామెంట్స్**

**మహా:** మాజీ కంటెస్టెంట్ యాంకర్ విష్ణుప్రియ బిగ్‌బాస్ షోపై సంచలన కామెంట్స్ చేసింది. ఈ షోకు ఎందుకు వెళ్లానా అని చెప్పుతో కొట్టుకోవాలంటూ అందరినీ ఆశ్చర్యపరిచింది. విష్ణుప్రియ మాట్లాడుతూ.. నేను డబ్బుల కోసమే బిగ్ బాస్ షోకు వెళ్లానని తెలిపింది. కొత్త ఇల్లు కట్టుకోవచ్చని కంటెస్టెంట్ గా ఎంటరయ్యానని.. కానీ అదేమీ జరగలేదని వాపోయింది. ఇప్పటికీ పాత ఇంట్లోనే ఉంటున్నానని.. బిగ్ బాస్ హౌస్ కు వెళ్లడమనేది తాను తీసుకున్న రాంగ్ డిసిషన్ అని వెల్లడించింది. ఒక్కసారి వెళ్లినందుకే తనను తాను తిట్టుకున్నానని.. ఎందుకు వెళ్లానా అని ఆలోచించానని స్పష్టం చేసింది. నా చెప్పుతో నన్ను నేనే కొట్టుకోవాలని తిట్టుకున్నానంటూ షాకింగ్ కామెంట్స్ చేసింది.

## లాలూ కొడుకు సీఎం సోనియా కొడుకు పీఎం కాలేరు

**బీహార్ లో అమిత్ షా సెటైర్లు**

**బీహార్, మహా:** లాలూ కుమారుడు సీఎం, సోనియా కుమారుడు పీఎం కాలేరని కేంద్రమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు విమర్శించారు. బీహార్ లో మంగళవారం దర్భంగా జిల్లాలో జరిగిన ప్రచార సభల్లో పాల్గొన్న అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. 'ఆర్‌జేడీ, కాంగ్రెస్ నాయకులు ప్రజలకంటే కుటుంబ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. లాలూరాబ్రీ తమ కుమారుడిని ముఖ్యమంత్రిగా, సోనియా గాంధీ తన కుమారుడిని ప్రధానమంత్రిగా చేయాలనుకుంటున్నారు. లాలూ కుమారుడు సీఎం, సోనియా గాంధీ కుమారుడు పీఎం కాలేరని నేను చెబుతున్నా. బీహార్‌లో సీఎంగా నీతీశ్ కుమార్ ఉంటే, ఢిల్లీలో ప్రధాని కుర్చీలో నరేంద్ర మోదీ ఉన్నారు' అని అమిత్ షా పేర్కొన్నారు.

## పంటలకు రక్ష భూసార పరీక్ష

**'రైతు నేస్తం' కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, మహా:** ప్రతి రైతు భూసార పరీక్ష చేయించుకోవడం వల్ల వారి భూములలో ఎంత శాతం పోషకాలు ఉన్నాయో తెలుస్తాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. తద్వారా పంటల సాగుకు అనుకూలంగా ఇంకా ఎంత మోతాదులో ఎరువులు వాడాలో తెలుస్తుందని, కాబట్టి భూసార పరీక్ష పత్రం ఆధారంగా ఎరువుల వాడకం వల్ల రైతులకు ఎరువులపై ఖర్చు తగ్గడమే కాకుండా, భూమి ఆరోగ్యం కూడా కాపాడినట్లు అవుతుందని తెలియజేసారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రతి మంగళవారం జరిగే 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం జరిగిన 74వ ఎపిసోడ్‌లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని, రైతులకు భూసార పరీక్ష పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా మంత్రి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నీటి వసతి కలిగిన ప్రతి రైతు వరి, పత్తి పంటల బదులు ఆయిల్ పామ్ పంట సాగు చేపట్టాలని, దాని ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చని, ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం మొక్కలు, డ్రిప్, అంతర పంటల సాగుకు ప్రోత్సాహం అందిస్తుందని, ఆయిల్ పామ్‌లో అంతర పంటలుగా కోకో, మిరియాలు, వక్క సాగు చేయడం వల్ల ఒకే భూమిలో ఎక్కువ రకాలైన పంటలు సాగుచేసి, అధిక ఆదాయం పొందవచ్చునని మంత్రి తెలియజేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

సమయానికి ప్రభుత్వం ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో.. కాలేజీ యాజమాన్యం తమ కళాశాలల బంద్‌కు పిలుపునిస్తుంది. ఆ క్రమంలో కాలేజీ యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. దీంతో వాయిదాల రూపంలో నగదు చెల్లిస్తామంటూ కాలేజీల యాజమాన్యానికి ప్రభుత్వం తెలుపుతోంది. అందుకు ఆ కాలేజీల యాజమాన్యం సానుకూలంగా స్పందిస్తోంది. అలా పలు దఫాలుగా నగదు చెల్లిస్తున్నాయి. అయితే కొన్ని సమయాల్లో నగదు చెల్లింపులు తీవ్ర ఆలస్యమవుతోంది. దీంతో ప్రభుత్వ వ్యవహారశైలిపై యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో కాలేజీల యాజమాన్యం రంగంలోకి దిగి బంద్ అంటూ ప్రకటనలు చేస్తున్నాయి. ఈ తరహా ఘటనలు పునరావృతం కావడంతో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వానికి కీలక సూచనలు చేయాలంటూ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.




## మణికొండలో కాల్పులు జరగలేదు

**డీజీపీ శివధర్ రెడ్డి**

**హైదరాబాద్, మహా :** రాయదుర్గం పీఎస్ పరిధిలోని మణికొండలో ఎలాంటి కాల్పులు జరగలేదని డీజీపీ శివధర్ రెడ్డి ప్రకటించారు. అక్కడ అక్కడ మామ అల్లుళ్ళ మధ్య పంచాయితీ నెలకొందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కెఈ ప్రభాకర్, ఆయన అల్లుడు అభిషేక్ గౌడ్ మధ్య ఆస్తి పంచాయితీ కొనసాగుతుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి ప్రభాకర్ తన అల్లుడు అభిషేక్ గౌడ్ పై ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. గన్ పెట్టి బెదిరించాడని ప్రభాకర్ ఫిర్యాదు చేశారని తెలిపారు. అల్లుడు అభిషేక్ గౌడ్ పై అక్టోబర్ 25 వ తేదీన రాయదుర్గం పీఎస్ లో కేసు నమోదు జరిగిందన్నారు. అభిషేక్ గౌడ్ పటాన్ చెర్వు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ కుమారుడు అని తెలిపారు.



# హైదరాబాద్‌కు పెట్టుబడుల వెల్లువ

**అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రాజెక్టుల విస్తరణ**

డ్యుయిష్ బోర్స్ కంపెనీ జీసీసీ.. వెయ్యి మందికి ఉద్యోగాలు

సీఎంతో కంపెనీల ప్రతినిధులు భేటీ

(మొదటిపేజీ తరువాయి)

మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు జర్మనీ బృందం వివరించింది.

**జీసీసీ ఏర్పాటుపై సీఎం హర్షం**

జీసీసీ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు ఈ సందర్భంగా జర్మనీ ప్రతినిధి బృందానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ఇందుకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. తెలంగాణ విద్యార్థులకు జర్మనీ భాషను నేర్చుకునే విషయంలో హైదరాబాద్‌లో జర్మనీ టీచర్లను నియమించి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణ ఓవర్సీస్ కంపెనీ టోమోకాం జీఎంటీఎస్ ద్వారా విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం, ఒకేషనల్ ఎడ్యుకేషన్, స్కిల్ వర్క్ విషయంలో శిక్షణ అందించడం వంటి అంశాల్లో సహకరించాలని అన్నారు. ఈ భేటీలో డుయిష్ బోర్సా చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ క్రిస్టోఫ్ బోమ్, జర్మనీ గౌరవ కాన్సుల్ (ఏపీ, తెలంగాణ), హైదరాబాద్ లిటరేరీ ఫెస్టివల్ డైరెక్టర్ అమిత ఆర్ దేశాయ్, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

**అమెజాన్ విస్తరణ**

తెలంగాణ రాష్ట్రంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రాజెక్టులను విస్తరించాలని, ఆ కంపెనీ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ బృందం మంగళవారం సచివాలయంలో రేవంత్ రెడ్డితో భేటీ అయింది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఏడబ్ల్యూఎస్ ప్రాజెక్టు పనులు, విస్తరణ ప్రణాళికలపై సీఎంతో వారు చర్చించారు. రాష్ట్రంలో ఏడబ్ల్యూఎస్ కంపెనీ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు, సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్ కెర్రీ పర్సన్, ఇన్ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ విక్రమ్ శ్రీధరన్, అనురాగ్ కిల్నాని, తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టులకు మరో బిగ్ షాక్

**సుక్మా అడవుల్లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ స్వాధీనం**

భారీ మొత్తంలో ఆయుధాలు సీజ్ చేసిన భద్రతా దళాలు

**ఛతీస్‌ఘడ్, మహా:** సుక్మా జిల్లా అడవి ప్రాంతాల్లో కొనసాగుతున్న నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భద్రతా దళాలు మరో ప్రధాన విజయాన్ని సాధించాయి. జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) బృందం అడవిలో లోపల నక్సలైట్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని కనిపెట్టింది. ఇది మావోయిస్టుల ఆయుధాల తయారీ, మరమ్మత్తుకు ప్రధాన స్థావరంగా ఉందని తెలుస్తోంది. సుక్మా జిల్లా గోంగూడ, కంచాల అడవుల్లో కూంబింగ్ సమయంలో డీఆర్జీ బలగాలు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని గుర్తించాయి. ఈ ఆపరేషన్ సమయంలో భద్రతా దళాలు మొత్తం 17 రైఫిళ్లు, బీజీఎల్ రాకెట్ లాంచర్లు, సింగిల్‌షాట్ రాకెట్ లాంచర్లు, దేశీయంగా తయారు చేసిన పిస్టల్స్, పెద్ద మొత్తంలో గన్‌పౌడర్, వైర్, బోర్‌హోల్ యంత్రాలు, డ్రిల్ యంత్రాలు, పైపులు, హ్యాండ్ డ్రిల్ యంత్రాలు, షీల్డ్‌లు, ఇతర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. పోలీసుల ప్రకారం, మావోయిస్టులు చాలా కాలంగా ఇక్కడ ఆయుధాలను మరమ్మతు చేసి తయారు చేస్తున్నారు. డీఆర్జీ తీసుకున్న ఈ వ్యూహాత్మక చర్య మావోయిస్టు నెట్‌వర్క్‌కు తీవ్రదెబ్బ తగిలింది. నిఘా సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఈ ఆపరేషన్ నిర్వహించి, ఎటువంటి ప్రాణనష్టం లేకుండా విజయాన్ని సాధించాయి. మావోయిస్టులకు మిగిలి ఉన్న ఏకైక మార్గం హింసను విడిచిపెట్టి, లొంగిపోయి, ప్రధాన స్రవంతిలోకి తిరిగి రావడమేనని సుక్మా పోలీసులు పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ నక్సలిజం బాధితుల ఉపశమనం మరియు పునరావాస విధానం2025 ప్రకారం, లొంగిపోయిన వారికి భద్రత, గౌరవం, పునరావాసం, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.



## ఛత్తీస్‌గఢ్‌లో రెండు రైళ్లు ఢీ

**ఆరుగురు మృతి.. పలువురికి గాయాలు**

ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీకొన్న ప్యాసింజర్ రైలు

**ఛత్తీస్‌గఢ్, మహా:** ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. జై రామ్ నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆగి ఉన్న గూడ్స్ రైలును ప్యాసింజర్ రైలు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఆరు మంది మరణించగా.. 25 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. ప్రాథమిక సమాచారం ప్రకారం, కోర్బా ప్యాసింజర్ రైలు, ఆగి ఉన్న ఒక గూడ్స్ రైలును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ప్యాసింజర్ రైలు మొదటి బోగీ.. గూడ్స్ రైలు పైకి ఎక్కింది. ప్రమాద స్థలం నుంచి వచ్చిన వీడియోలలో ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వెంటనే రెస్క్యూ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదం హౌరా రూట్ మార్గంలో జరగడం వలన రైలు రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి, పలు రైళ్లను దారి మళ్లించారు.

**ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు..**

అయితే, రైల్వే అధికారులు ఈ ప్రమాదానికి గల కారణాలపై వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. సిగ్నలింగ్ లోపం లేదా మానవ తప్పిదం వంటి వాటిని ప్రధానంగా అనుమానిస్తున్నారు. కొన్ని నివేదికల ప్రకారం, ఈ ప్రమాదం లాల్‌ఖడాన్ సమీపంలో జరిగిందని, ఈ ఢీకొనడం కారణంగా కొన్ని బోగీలు పట్టాలు తప్పినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో తీవ్ర గందరగోళం నెలకొనగా, పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను నియంత్రించి, సహాయక చర్యలకు తోడ్పడుతున్నారు. రైల్వే మంత్రిత్వ శాఖ అధికారులు కూడా ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి, క్షుణ్ణంగా విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేశారు.

**సహాయ పథకాలు, హెల్ప్‌లైన్ నంబర్లు..**

ప్రమాదం అనంతరం రైల్వే శాఖ అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు విడుదల చేసింది. గాయపడిన వారి వివరాల కోసం ప్రయాణికుల కుటుంబ సభ్యులు సంప్రదించవచ్చని తెలిపింది. బాధిత కుటుంబాలకు తక్షణ సాయం కింద రూ.10 లక్షలు, తీవ్ర గాయపడిన వారికి రూ.2 లక్షలు, స్వల్ప గాయపడిన వారికి రూ.50,000 పరిహారం ప్రకటించారు.

**రైల్వే మంత్రిత్వ శాఖ స్పందన**

ప్రమాదంపై రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తక్షణమే సమీక్ష చేపట్టి, దర్యాప్తు ఆదేశించారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరుగుతుందని తెలిపారు. "ప్రాణనష్టం చాలా బాధాకరం. బాధిత కుటుంబాలకు పూర్తి సహాయం అందిస్తాం," అని రైల్వే మంత్రి పేర్కొన్నారు.



గడప గడప ప్రచారంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జూబ్లీ హిల్స్, మహా:** జూబ్లీహిల్స్ లో మంగళవారం గడప గడపకు తిరిగు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని ప్రచారం చేశారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య రెహామత్ నగర్ , బంగారు మైసమ్మ ఆలయం వద్ద ఉన్న ఆరు బూత్ లల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలసి పెద్ద ఎత్తున్న ప్రచారం నిర్వహించారు. ప్రతి ఓటరు ను కలసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న కార్యక్రమాలను పథకాలను వివారిస్తు ఓటును అభ్యర్ధిస్తున్నారు. స్థానిక మన అందరి బిడ్డ నవీన్ యాదవ్ చేయి గుర్తుకు ఓటు వేసి అభివృద్ధి కి తోడుండాలని ఓటర్లను కలసి ఓటు అభ్యర్ధిస్తున్నారు.



మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎంపీడీవో

**వలిగొండ, మహా:** వేములకొండ మత్స్యగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రోజున పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి జలంధర్ రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణ అధికారి సల్వాద్రి మోహన్ బాబు ఎంపీడీవోని శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పులిగిల్ల గ్రామపంచాయతీ కార్యదర్శి సైదులు పాల్గొన్నారు.

# రూ. 3వేల కోట్ల బకాయిలు చెల్లించండి

## డిసెంబర్ నెలలో మద్యం సరఫరా చేయలేం.. ప్రభుత్వానికి మద్యం కంపెనీలు ప్రభుత్వానికి అల్టిమేటం




**హైదరాబాద్, మహా:** నవంబర్ 10వ తేది లోపు రూ. 3వేల కోట్ల బకాయిలు క్లీయర్ చేయాలని, డిసెంబర్ నెలలో మద్యం సరఫరా చేయలేమని మద్యం కంపెనీలు ప్రభుత్వానికి అల్టిమేటం వేశాయి. ఈ మేరకు మంగళవారం రాష్ట్రంలో మద్యం కోరత ఏర్పడనుందని లేఖ రాశాయి. ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఎస్‌డబ్ల్యూఏఐ), బ్రేవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా( బీఏఐ), కాన్ఫిడేరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజ్ కంపెనీస్(సీఏబీసీ)లు లేఖలో పేర్కొన్నాయి. రాష్ట్రం నుంచి రావల్సిన బకాయిలు రూ.3366కోట్లు ఉన్నట్లు తెలిపాయి. నవంబర్ 2వ తేదిన పంపిన లేఖలో పేర్కోంది. ఆల్కోబెవ్ కంపెనీలకు దీపావళి నిరాశాజనకంగా ఉందని, పండుగ సీజన్ విషాదకరంగా ఉందని పేర్కోన్నాయి. చెల్లింపు సంక్షోభం తీవ్రమవుతున్నందున తెలంగాణలో పండుగ సీజన్‌లో మద్య పానీయాల కొరతను ఆశించండి అని పరిశ్రమ సంఘాలు చెబుతున్నాయని పేర్కోన్నాయి. జూన్ నుంచి అక్టోబర్ వరకు ప్రభుత్వం చెల్లించిన బకాయిలు వివరాలు వెల్లడించాయి.

# శబరిమల దర్శనానికి వెళ్లే భక్తులకు భరోసా..!

## నీలక్కల్‌లో రూ.6.12 కోట్లతో ఆరోగ్య కేంద్రం.. శబరిమల మార్గంలో సదుపాయాల విస్తరణ

**మహా:** ఆధ్యాత్మిక భక్తి, మానవ సేవ కలిసినప్పుడు సృష్టించబడే ఉదాత్త దృశ్యం నీలక్కల్‌లో కనిపిస్తోంది. శబరిమల యాత్రికుల కోసం సౌకర్యాల విస్తరణలో భాగంగా కేరళ ప్రభుత్వం రూ.6.12 కోట్లతో అత్యాధునిక స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ ఆసుపత్రి కేవలం ఒక వైద్య కేంద్రం మాత్రమే కాదు ఇది భక్తి, భద్రత, సేవల మేళవింపు. లక్షలాది మంది భక్తులు ఎరుమెలీ నుండి సబరిమల పర్వత మార్గం వరకు చేసే దీక్షా యాత్రలో, నీలక్కల్ బేస్ క్యాంప్ ఒక కీలక విశ్రాంతి స్థలం. ఇప్పుడు అదే ప్రదేశం వైద్యరక్షణకు పునాది అవుతోంది. శబరిమల యాత్ర కేవలం పూజా ప్రక్రియ కాదు. అది మానసిక, శారీరక క్రమశిక్షణకు ప్రతీక. 48 రోజుల మండల దీక్ష తర్వాత "స్వామి శరణం అయ్యప్ప" అంటూ భక్తులు నీలక్కల్, పాంపా, సబరిమల మార్గం వైపు ప్రయాణిస్తారు. ఈ క్రమంలో శారీరక శ్రమ, పర్వత మార్గాలు, వాతావరణ మార్పులు కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్మిస్తున్న ఈ స్పెషాలిటీ ఆసుపత్రి యాత్రికులకు రక్షణ కవచం లాంటిది. కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ మాట్లాడుతూ, శబరిమల యాత్రికుల శ్రేయస్సును నిర్ధారించడంలో ప్రభుత్వ నిబద్ధతను ఈ ఆసుపత్రి ప్రతిబింబిస్తుంది అన్నారు. భక్తి యాత్రలో పాల్గొనే ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండటం కూడా ఆధ్యాత్మిక సేవలో భాగమేనని ఆమె పేర్కొన్నారు. ఆరోగ్య సేవల రూపంలో ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నం అయ్యప్ప భక్తుల పట్ల కేరళ ప్రభుత్వ భక్తిగా భావించవచ్చు.



ఆసుపత్రి నిర్మాణం.. భక్తుల రక్షణకు ఆవాసం

ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు కేటాయించిన స్థలంలో నిర్మించబడుతున్న ఈ ఆసుపత్రి మొత్తం 10,700 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండనుంది. ఇందులో మూడు ఔట్ పేషెంట్ గదులు, అత్యవసర విభాగం, ఐసియు, నర్సుల స్టేషన్, ఇసిజి గది, ఫార్మసీ, ఎక్స్‌రే గది, బహుళ ఆపరేషన్ థియేటర్లు, స్క్రబ్ స్టేషన్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఇది కేవలం వైద్య సేవల కేంద్రం మాత్రమే కాదు నీలక్కల్ మార్గంలో భక్తులకు రక్షణదామం. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు శబరిమల ఆలయ నిర్వహణలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇప్పుడు ఈ ఆసుపత్రి నిర్మాణానికి స్థలం కేటాయించడం ద్వారా ఆ సంస్థ తన సేవాభావాన్ని మరోసారి నిరూపించింది. భక్తులకు మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సేవలు అందించడమే కాక, ఇది సేవా ధర్మానికి ప్రతీకగా నిలుస్తుంది. శబరిమల మార్గంలో భక్తులకు నీరు, ఆహారం, వసతి, వైద్య సహాయం అందించడంలో దేవస్వం బోర్డు నిరంతరం సహకరిస్తోంది.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కీలక పరిణామం

### బిజెపికి మద్దతుగా జనసేన

- ప్రచారంలో పవన్ కల్యాణ్ పాల్గొనే అవకాశం
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో భేటీ అయిన జనసేన
- తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్

**హైదరాబాద్,మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి జనసేన పార్టీ మద్దతు ప్రకటించింది. జనసేన రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో భేటీ అయి బిజెపికి పూర్తి మద్దతు ప్రకటించారు. రెండు పార్టీల నాయకులు జాయింట్ ప్రెస్ మీట్ నిర్వహించి తమ భవిష్యత్ కార్యాచరణను వివరించనున్నారు. హైదరాబాద్ లోని సాగర్ సొసైటీలో జరిగిన ఈ భేటీలో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి తోపాటు పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తోపాటు రెండు పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ భేటీ జనసేన అధ్యక్షులు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జరిగినట్టు నాయకులు తెలిపారు.

## వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు

# అప్రమత్తంగా వుండాలి

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ఆలేరు, మహా:** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, తేమ వచ్చిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. మంగళవారం ఆలేరు మండలం కొలనుపాకలో ఐ.కే.పి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు... ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ...కొనుగోలు కేంద్రంలో ఈరోజుకురిసిన వర్షానికి ధాన్యం ఏమైనా తడిసిందా అని అడిగి తెలుసుకున్నారు. రైతులందరూ కలిసి ఎల్లపుడు అప్రమత్తంగా ఉండాలని ఈ అకాల వర్షాలు ఎప్పుడు వస్తాయో తెలవని పరిస్థితి ఉందన్నారు. ధాన్యం కుప్పలను టార్పాలిన్స్ కవర్లతో కప్పి ఉంచాలని సూచించారు.ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు అని అడిగారు. కొనుగోలు చేసినంత వరకు ట్యాబ్ ఎంట్రీ పూర్తి అయిందా అని అడిగి ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. నిర్వాహకులు రోజు తేమశాతం చెక్ చేసి వచ్చిన ధాన్యం కుప్పలను కాంటా వేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రంలో వచ్చే సీజన్ వరకు రైతులు సేద తీరేందుకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని స్థానిక తహసీల్దార్ కు తెలిపారు. అనంతరం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో లోలెవల్ బ్రిడ్జి పై నుండి వెళ్లే వరద ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బ్రిడ్జిని పరిశీలిస్తూ వరద ప్రవాహం వల్ల బ్రిడ్జి దెబ్బినడంతో వాహనదారులు ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి



కాబట్టి కొత్త బ్రిడ్జి పూర్తి అయ్యేలోపు ప్రక్క నుండి కంకర మొరం పోసి లెవల్ చేసి పయనించే విధంగా వెంటనే మరమ్మతులు చేయాలని, గుంతలు ఉన్న చోట తక్షణమే గుంతలు పూడ్చాలని జిల్లా కలెక్టర్ కాంట్రాక్టర్ ని ఆదేశించారు. అనంతరం ఆలేరు మండల కేంద్రంలో సి సి ఐ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. సీసీఐ కొనుగోలు కేంద్రాలు తేమ శాతం సరిగా చూడాలన్నారు. ఈరోజు ఎంత మంది రైతులు పత్తి తీసుకొని వచ్చారని అడిగి తెలుసుకున్నారు. అందులో ఎంత తేమ శాతం వచ్చింది అని అడిగారు. మిల్లులో ఉన్న పత్తి తేమశాతం పరిశీలించారు. కొన్ని సార్లు మిషన్ ప్రాబ్లం వలన కూడా తేమ శాతం ఎక్కువ చూపెడుతుందన్నారు, కాబట్టి ఎక్కువ తేమ శాతం వచ్చిన పత్తిని మళ్లీ ఒకసారి చూసి కొనుగోలు చేయాలని తెలిపారు.సిసీఐ కొనుగోలు నిర్వాహకులు రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య రెడ్డి, ఆలేరు తహసీల్దారు తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 15న ప్రత్యేక లోక్ అదాలత్

### ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష

**వలిగొండ, మహా :** ఈ నెల 15న నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకునేలా, పరిష్కార మార్గం చూపాలని రామన్నపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శిరీష సమక్షంలో సమన్వయ సమావేశం నిరహించారు. ఈ సమావేశంలో జడ్జీ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా అన్ని విభాగాల అధికారులు, న్యాయవాదులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవడానికి కక్షిదారులకి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ



కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. వేంకటేశ్వర్లు, రామన్నపేట, వలిగొండ, ఎస్ఐ లు డి.నాగరాజు, యుగేందర్ గౌడ్, నాగరాజు, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు బాసటగా నిలిచిన విద్యార్థి తలాంక్ భువన్

**వరంగల్ మహా;** పుత్రుడు జన్మించి నప్పుడు కాదు పెరిగి పెద్దయ్యాక తమ పేరును నిలబెట్టినప్పుడే ఆ తల్లి దండ్రులకు పుత్రోత్సాహం కలుగుతుందన్నట్లు చిరు ప్రాయంలోనే సేవా గుణంలో తండ్రికి తగ్గ తనయుడిగా నిలిచిన చిచ్చరపిడుగు గందె తలాంక్ భువన్. సర్వసాధారణంగా పిల్లలు దాచుకున్న డబ్బుతో వారికి నచ్చిందే కొనుక్కుంటారు లేదా కొంత మంది పిల్లలు తమ తల్లిదండ్రులకు అవసరమైన సమయంలో ఇచ్చేవారు కూడా ఉంటారు. కానీ ఈ చిచ్చర పిడుగు వరద బీభత్సవంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన కొంతమంది బాధితులకు తాను దాచుకున్న డబ్బులతో ఆహర పదార్థాలను పంపిణి చేసిన వరంగల్ 28 వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ కుమారుడు 10 వ తరగతి చదువుతున్న విద్యార్థి తలాంక్ భువన్. మంగళవారం తన తోటి విద్యార్థులతో కలిసి హంటర్ రోడ్ లోని ముంపు ప్రాంతాలైన ఎన్టీఆర్ నగర్ లో నీట మునిగిన కుటుంబాలకు పాలు, బ్రెడ్, స్నాక్స్ బిస్కెట్



ప్యాకెట్స్, బూస్ట్, హార్లిక్స్, తో పాటు చాక్లెట్స్ మూన్దాల్ మిక్సర్ ప్యాకెట్లు వంటి ఆహార పదార్థాలను దాదాపు 140 మందికి పంపిణీ చేశారు. చిన్న వయసులోనే ఇంత గొప్పగా ఆలోచించి ప్రజలకు పిల్లలు పంపిణి చేసిన సేవా తీరును స్థానిక కాలనీ వాసుల తో పాటు ప్రముఖ సేవా సంఘాల వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ 10 క్లాస్ గందె తలాంగ్ భువన్ పెల్లి షణ్ముఖ, పిన్న విహారి కృష్ణ దయ మంచన సాంబావ్, రాజేష్‌రాము అఖిల్, బాగల్ కళ్యాణ్, శివ, పాల్గొన్నారు

# నష్టమైన పంటల వివరాలను త్వరగా నమోదు చేయండి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హన్మకొండ మహా;** ఇటీవల భారీ వర్షాలతో దెబ్బ తిన్న వరి, పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలకు నష్ట పరిహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించే వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు త్వరగా నమోదు చేసి నివేదికను అందజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు, ముప్పారం గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, రోడ్లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ధర్మసాగర్ దేవునూరు ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు, వంతెన, వరి పంటలు దెబ్బతినగా కలెక్టర్ నడుచుకుంటూ వెళ్లి అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. రోడ్ల మరమ్మతు పనుల గురించి పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. గ్రామంలో పంట నష్టం, రోడ్ల నష్టం పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ సుమారుగా అర కిలోమీటరు మేర నడుచుకుంటూ వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో వేసిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు ఎంత మేరకు నష్టం జరిగిందని వివరాలను వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులకు చెందిన పంట పొలాలు నీట మునిగి దెబ్బతిన్న వరి పంటను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించి జరిగిన పంటల నష్టం గురించిన స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ లో దెబ్బతిన్న పంటల వివరాల నమోదు చేస్తున్న సమాచారాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ సింగ్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. వరదలతో పశు సంపదకు జరిగిన నష్టం గురించిన వివరాలను కలెక్టర్ కు తెలియజేశారు. వరద తాకిడికి సుమారు 450 క్వింటాళ్ల వరి ధాన్యం కొట్టుకుపోయిన వివరాలను వెల్లడించారు. స్థానిక చెరువు నుండి వచ్చిన వరద నీటితో దెబ్బతిన్న రోడ్లను, పంట నష్టాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ధర్మసాగర్ రిజర్వాయర్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్ కు ఎంత ఇన్ ఫ్లో వస్తుందని , రిజర్వాయర్ కెపాసిటీ, అవుట్ ఫ్లో గురించి నీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గత నెల 29వ తేదీన రిజర్వాయర్ లో ఉన్న నీటి సామర్థ్యం, ఇతర వివరాలను కలెక్టర్ కు అధికారులు వివరించారు. కలెక్టర్ వెంట పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, డిఈ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ మంగీలాల్, ధర్మసాగర్ తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, ఏవో రాజేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.







## నష్టపోయిన పంటలు,ఆస్తి వివరాలను త్వరగా సమర్పించాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ మహా;** ఇటీవల మొంథా తుఫాన్ తో అతిభారీ వర్షం కారణంగా వరదలతో నష్టపోయిన పంటలు, ఆస్తి వివరాలు త్వరగా నమోదు చేసి సమగ్ర నివేదికను సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యాప్తంగా వాటిల్లిన నష్టంపై వివరాల నమోదు పురోగతి, పునరుద్దరణ కు చేపట్టాల్సిన తాత్కాలిక, శాశ్వత పనులు, రూపొందించాల్సిన జిల్లా, మండలాల సమగ్ర ప్రణాళిక పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పునరుద్దరణకు తాత్కాలిక, శాశ్వత మరమ్మతు పనుల వివరాలను రెండు రోజుల్లోపు సమర్పించాలన్నారు. అలాగే భవిష్యత్తులో ముంపు సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వానికి సమర్పించుటకు జిల్లా, మండలాల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను వారం రోజుల్లోగా రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయి, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ లు సుమా, ఉమారాణి, వ్యవసాయ, ఆర్ అండ్ బి, ఇంజనీరింగ్, పంచాయతీ రాజ్, విద్యుత్, రెవెన్యూ, మునిసిపల్, పశు సంవర్ధక, తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే

# సెక్రటేరియట్ ముట్టడిస్తాం

### యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేష్ నాయక్

**హన్మకొండ మహా;** భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని కాకతీయ డిగ్రీ కళాశాల గేటు వద్ద నిరసన చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఫీజు బకాయిలు ప్రభుత్వం విడుదల చేయక పోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కళాశాల యాజమాన్యాలు ఫీజు చెల్లించాల్సిందేనని విద్యార్థుల పై మానసిక ఒత్తిడి తెస్తున్నారని దీంతో దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు వారి పరిస్థితిని ఎవరికి చెప్పుకోవాలి అర్థం కాక ఉన్నత చదువులకు వెళ్లలేక చదువు మధ్యలోనే మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశా లు టెక్నికల్ కోర్సు అన్నీ కూడా బంద్ పాటిస్తూ నిరసన తెలియజేస్తున్న కూడా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్యం చేయడం సిగ్గుచేటు అని మరొ పక్క ప్రభుత్వం స్పందించకపోవడం అనేది విద్యార్థులను చదువులకు దూరం చేయడమేనని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యాజమాన్యాలతో చర్చలు జరిపి బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చి కళాశాలలు తెరిచే విధంగా చూడాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫీజు బకాయిలు విడుదల చేసేంతవరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నితిన్ చందు, శ్రీనాథ్, బన్నీ మహేష్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.





## శ్రీ ధనమైసమ్మ ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు

### ఆలయ అధ్యక్షులు తోట బాబన్న

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం శ్రీ శివసాయినగర్ కాలనీ లోని శ్రీ మెట్లబావి ధనమైస మ్మ ఆలయంలో కార్తీక మాసంలో వచ్చే శివునికి అత్యంత పరమ పవిత్రమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ లక్ష్మీదేవి కి ప్రత్యేక నైవేద్యాలతో పూజలు అలాగే ఉసిరి చెట్టుకు పూజ, శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ అధ్యక్షులు తోట బాబన్న తెలిపారు. శివపార్వతులకు ప్రత్యేక పూజల తో పాటు అమ్మవారిని శ్రీ లక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిస్తుందని తోట బాబన్న తెలిపారు. అమ్మవారిని అలంకరించిన వారిలో తోట సంధ్య, ఎం వాణిశ్రీ, జి అనిత, ఎం శోభ, రూప ఉన్నారు.

## ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నేతలు

**వరంగల్ మహా;** హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని షేక్ పేట డివిజన్లలో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నేతలు మడిపెల్లి కృష్ణ గౌడ్, చిప్ప వెంకటేశ్వర్లు నేత, మీసాల ప్రకాష్, ముఖ్య నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీ అభ్యర్థికి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని తద్వారా నియోజకవర్గ అభివృద్ధి తో పాటు షేక్ పేట్ అభివృద్ధి చెందుతుందని జరుగుతుందని కాంగ్రెస్ పార్టీని బలపరిచే సువర్ణ అవకాశం జూబ్లీహిల్స్ ప్రజలందరి పై ఉందని మీ విలువైన ఓటును యువనేత నవీన్ యాదవ్ కు తప్పక వేసి అసెంబ్లీకి పంపాలని ఓటర్లను అభ్యర్థించారు.

# ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలి

### ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ.. రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి

**ఆలేరు, మహా:** కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి అన్నారు. మంగళవారం ఆలేరు మండల కేంద్రంలో ఎఫ్. పి .ఓ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...ఇప్పటి వరకు ఎన్ని ధాన్యం కుప్పలు వచ్చాయని అడిగి తెలుసు కున్నారు. ఉదయం, సాయంత్రం తేమ శాతం చూసి వచ్చిన వెంటనే కాంటా వేసి కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ప్రభుత్వం తరుపు నుండి టార్పలిన్ ఇవ్వడం జరిగిందని , వర్ష సూచన ఉన్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్ లు అందుబాటులో ఉంచుకొని కప్పాలన్నారు. అప్పుడు ఎంత వర్షం వచ్చినా ధాన్యం తడవకుండా ఉంటుందన్నారు. రైతులు ధాన్యం విషయంలో జాగ్రత్తవహించాలన్నారు.రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాలకి వచ్చిన ధాన్యాన్ని తేమ శాతం వచ్చిన వెంటనే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. తేమ శాతం వచ్చిన ధాన్యం కుప్పలను ఎప్పటికపుడు తూకం వేసి లారీ లో లోడ్ చేసి సంబంధిత మిల్లులకు పంపించాలన్నారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు ఉండటానికి వీలు లేదన్నారు . ఎప్పుడు వచ్చిన ధాన్యాన్ని అప్పుడే పంపాలన్నారు. అనంతరం ఆలేరు మండల తాహసిల్దార్ కార్యాలయంను సందర్శించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను నిర్దిష్ట గడువు లోపు పూర్తి చేయాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా సరైన పద్ధతిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సంఘం నిర్దేశించిన విధులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.2002 ఓటరు జాబితా, ప్రస్తుత 2025 ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ మ్యాపింగ్ గడువు లోగా పూర్తి చేయాలన్నారు.. ప్రతి పోలింగ్ స్టేషన్ వారీగా ఈ ప్రక్రియ ను బి ఎల్ ఓ లు పూర్తిచేసేలా బిఎన్ఓ సూపర్వైజర్లు ఏఈఆర్వోలు స్వీయ పర్యవేక్షణ చేయాలన్నారు.



## బయో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టండి

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

గ్రేటర్ వరంగల్ నగరంలో బయో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఎన్ ఐ యు ఏ ప్రతినిధులకు సూచించారు. మంగళ వారం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఎన్ ఐ యు ఏ) వారు నిర్వహించిన వర్చువల్ సమావేశం లో కమిషనర్ ప్రధాన కార్యాలయం నుండి పాల్గొని ప్లాంట్ ఏర్పాటు కు తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ నగరం లో 100 టి పి డి సామర్థ్యం తో బయో మిథనైజేషన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఇందుకు సంబంధించి గతం లో నగరం లో చెత్త సేకరణకు చెందిన సమాచారం అందజేశామని, ఎన్ ఐ యు ఏ వారు నగరం లో క్షేత్ర స్థాయి లో వాస్తవ శానిటేషన్ స్థితి గతులను కూడా అధ్యయనం చేశారని, ఇందుకు సంబంధించి చెత్త సేకరణ విధానాలు? చెత్త తరలింపు పద్ధతులను సమగ్రం గా అధ్యయనం చేసిన నేపథ్యం లో ప్లాంట్ ఏర్పాటు అవసరమైన సామాగ్రి సమకూర్చుకొని ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భం గా కమిషనర్ వారికి సూచించారు. ఎస్ ఈ సత్యనారాయణ సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఎం హెచ్ ఓ డా.రాజేష్, ఎన్ ఐ యు ఏ సభ్యులు అనురీత, దీప్తి ప్రతి, రాహుల్ పాల్గొన్నారు.

# అకాల వర్షంతో తడిసి ముద్దయిన పత్తి బస్తాలు

## రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి


**వరంగల్ మహా;** సూర్యోదయం మొదలు నుంచే వరంగల్ నగరంలో మంగళవారం వర్షం దంచి కొట్టింది. ఈ అకాల వర్షానికి ఏనుమాముల మార్కెట్లో రైతులు అమ్మకానికి తీసుకువచ్చిన పత్తి బస్తాలు మొత్తం తడిసి ముద్దయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని అమ్ముదామని మార్కెట్ కు తీసుకువస్తే అకాల వర్షం వల్ల భారీగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ చూపి తడిసిన పత్తిని కొనేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రైతుల డిమాండ్ చేస్తున్నారు.



# అంగన్ వాడి పాఠశాలకు కుర్చీలు బహుమతి

**వలిగొండ, మహా :** వలిగొండ మండల పరిధి లోని పులిగిల్ల గ్రామానికి చెందిన ఆశా వర్కర్ వరకాంతం మమత తన భర్త రవీందర్ రెడ్డి జ్ఞాపకార్థం అంగన్వాడి పాఠశాలకు మంగళవారం కుర్చీలు బహుమతిగా అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్ అంగన్వాడి టీచర్ కోమాల కలమ్మ బాల జ్యోతి స్వరూప వరలక్ష్మి అచ్చమ్మ ఉమా తదితరులు పాల్గొన్నారు






# జీపీ హిందూజా..
# దార్శనిక పారిశ్రామిక దిగ్గజం


**గోపీచంద్ పరమానంద హిందూజ**
(29 జనవరి 1940 - 4 నవంబర్ 2025)

మహా పత్రిక | 05-11-2025, బుధవారం, హైదరాబాద్ | 04

**మహా ప్రత్యేకం:** గోపీచంద్ హిందూజా దిగ్గజ వ్యాపారవేత్తనే కాదు.. ధర్మంతో వ్యాపారం, మానవత్వంతో సేవ సిద్ధాంతంగా పెట్టుకున్నారు. ఆయన అడుగుపెట్టని రంగం లేదు. చేయని వ్యాపారం లేదు. హిందూజా గ్రూప్ చైర్మన్‌గా గోపీచంద్ పి. హిందూజా ప్రపంచ వ్యాపార రంగంలో భారతీయ గర్వంగా నిలిచారు. 100కు పైగా దేశాల్లో వ్యాపార విస్తరణతో హిందూజా గ్రూప్ గ్లోబల్ స్థాయిలో అగ్రగామిగా ఉంది. ఆటోమొబైల్, బ్యాంకింగ్, ఇంధనం, ఐటీ, హెల్త్‌కేర్ వంటి రంగాల్లో ఆయన దూరదృష్టి, వ్యూహాత్మక నిర్ణయాలు కీలక పాత్ర పోషించాయి. హిందూజా గ్రూప్ చైర్మన్, భారత సంతతికి చెందిన బిలియనీర్ గోపీచంద్ పి. హిందూజా బుధవారం లండన్ ఆసుపత్రిలో మరణించారు. ఆయన వయసు 85 సంవత్సరాలు. నలుగురు హిందూజా సోదరులలో పెద్దవాడైన గోపీచంద్ పి. హిందూజా చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని కుటుంబ వర్గాలను ఉటంకిస్తూ వార్తా సంస్థ పిటిఐ నివేదించింది. బ్రిటిష్ హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడైన రేంజర్ ఒక ప్రకటనలో సంతాపాన్ని వ్యక్తం చేశారు. వ్యాపార రంగంలో ఆయనను "జీపీ" అని పిలుస్తారు. ఆయన భార్య సునీత, కుమారులు సంజయ్, ధీరజ్, కుమార్తె రీటా ఉన్నారు. రెండవ తరం హిందూజా కుటుంబ సభ్యుడైన గోపీచంద్ తన అన్నయ్య శ్రీచంద్ మరణం తర్వాత మే 2023లో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు.







## గోపీచంద్ హిందూజా ఎవరు?

యుకె సండే టైమ్స్ రిచ్ లిస్ట్ ప్రకారం..జీపీ హిందూజా వరుసగా ఏడు సంవత్సరాలు యునైటెడ్ కింగ్‌డమ్‌లో అత్యంత ధనవంతుడు. 1940 లో భారతదేశంలో జన్మించిన ఆయన హిందూజా ఆటోమోటివ్ లిమిటెడ్ చైర్మన్‌గా కూడా పనిచేశారు. తండ్రి పి.డి. హిందూజా 1914లో ఇరాన్‌లో వ్యాపారం ప్రారంభించగా, గోపీచంద్ ఆ వారసత్వాన్ని ఆధునిక దిశగా నడిపించారు. సోదరులు శ్రీచంద్, ప్రమోద్, అశోక్ హిందూజాలతో కలిసి హిందూజా గ్రూప్‌ను ప్రపంచ కార్పొరేట్ శక్తిగా తీర్చిదిద్దారు. "My Duty is My Religion" అనే తత్వంతో ఆయన నడిచే వ్యాపారశైలీ నైతికతకు నిదర్శనం. 2023లో తన సోదరుడు శ్రీచంద్ హిందూజా చిత్తవైకల్యంతో మరణించిన తర్వాత గ్రూప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. గోపీచంద్ హిందూజా 1959లో ముంబైలోని జై హింద్ కళాశాల నుండి పట్టభద్రుడయ్యాడు. వెస్ట్ మినిస్టర్ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టర్ ఆఫ్ లాస్ డిగ్రీని పొందాడు. లండన్‌లోని రిచ్‌మండ్ కళాశాల నుండి ఆర్థిక శాస్త్రంలో గౌరవ డాక్టరేట్‌ను కూడా పొందాడు. హిందూజా కుటుంబ వ్యాపారాన్ని మొట్టమొదట 1914లో జి.పి. హిందూజా తండ్రి పరమానంద్ హిందూజా స్థాపించారు. ఆయనే స్థాపకుడు కూడా. గోపీచంద్ హిందూజా, ఆయన సోదరుడు శ్రీచంద్ హిందూజా ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేసి నేడు బిలియన్ డాలర్ల సమ్మేళనంగా మార్చారు.

## హిందూజా ఫ్యామిలీ నెట్‌వర్త్

పిచంద్ హిందూజా కుటుంబం బ్రిటన్‌లో అత్యంత ధనవంతులుగా నివేదించబడింది. ఫోర్బ్స్ రియల్‌టైమ్ నెట్ వర్త్ ప్రకారం.. మంగళవారం నాటికి హిందూజా కుటుంబం నికర విలువ $20.6 బిలియన్లు లేదా దాదాపు రూ.182,668 కోట్లు. హిందూజా కుటుంబం లండన్‌లో రియల్ ఎస్టేట్ ఆస్తులను కలిగి ఉంది. వాటిలో వైట్‌హాల్‌లోని చారిత్రాత్మక ఓల్డ్ వార్ ఆఫీస్ భవనంలో ఉన్న రాఫెల్స్ లండన్ హోటల్ కూడా ఉంది.హిందూజా గ్రూప్ ఆటోమోటివ్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ, హెల్త్‌కేర్, రియల్ ఎస్టేట్, పవర్, మీడియా, వినోదం వంటి 11 రంగాలలో పనిచేస్తుంది. దాని ప్రసిద్ధ బ్రాండ్లలో అశోక్ లేలాండ్., ఇండస్‌ఇండ్ బ్యాంక్, నెక్స్ట్ డిజిటల్ లిమిటెడ్ ఉన్నాయి.




## జీపీ హిందూజా.. హైలెట్స్

- గోపీచంద్ పి. హిందూజా ప్రపంచవ్యాప్తంగా వ్యాపార సామ్రాజ్యం నిర్మించిన హిందూజా గ్రూప్ ప్రస్తుత చైర్మన్.
- ఆయన కుటుంబ వ్యాపార వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రపంచ వ్యాప్తంగా 100కి పైగా దేశాల్లో వ్యాపార విస్తరణకు దోహదపడ్డారు.
- హిందూజా గ్రూప్ కార్యకలాపాలు ఆటోమొబైల్, ఎనర్జీ, బ్యాంకింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హెల్త్‌కేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాలలో విస్తరించి ఉన్నాయి.
- నైతిక విలువలు, కఠిన క్రమశిక్షణ, మరియు దీర్ఘదృష్టి ఆయన నాయకత్వ లక్షణాలు.
- హిందూజా గ్రూప్‌లో ఉద్యోగుల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా లక్షల్లో ఉంది.
- అశోక్ లేలాండ్, ఇండిబ్యాంక్, గల్ఫ్ ఆయిల్, హిందూజా గ్లోబల్ సొల్యూషన్స్ వంటి ప్రముఖ కంపెనీలు ఆయన ఆధ్వర్యంలో ఉన్నాయి.
- లండన్‌లోని హిందూజా హాస్పిటల్ మరియు హెల్త్‌కేర్ వెంచర్స్‌కు ఆయన ప్రోత్సాహకుడు.
- ముంబైలోని పీ.డి. హిందూజా హాస్పిటల్ ప్రపంచస్థాయి వైద్య సేవల కేంద్రంగా ప్రసిద్ధి పొందింది.
- 2023లో హిందూజా కుటుంబం బ్రిటన్‌లో అత్యంత సంపన్న కుటుంబంగా గుర్తింపు పొందింది.
- ఫోర్బ్స్ బిలియనీర్స్ లిస్టులో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది.
- వ్యాపారానికి తోడు ఆయన ఆధ్యాత్మికతకు కూడా పెద్ద ప్రాధాన్యత ఇస్తారు.
- బ్రిటన్‌ఇండియా బిజినెస్ సంబంధాలను బలపర్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.
- హిందూజా గ్రూప్ వార్షిక ఆదాయం బిలియన్ల డాలర్లలో ఉంది.
- గోపీచంద్ హిందూజా ప్రపంచవ్యాప్తంగా భారతీయ వ్యాపార ప్రతిష్ఠను పెంచిన ప్రముఖ వ్యాపారవేత్త.
- "ధర్మంతో వ్యాపారం – మానవత్వంతో సేవ" ఆయన జీవన తత్వానికి మూల సూత్రం.







# కవిత జనం బాట

## జిల్లా పర్యటనపై మీడియా సమావేశం

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా ప్రజల గోసను ప్రభుత్వాలు పట్టించుకోవాలని జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించిన ఆమె పట్టణంలోని ఓ హోటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.మావలలోని కొమురం భీమ్ కాలనీలో నివసిస్తున్న ఆదివాసులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాలనీలో సరైన వసతులు లేక ఆదివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.అక్కడ 180 ఎకరాలు కబ్జా చేసిన బడా బాబులను వదిలేసి ఆదివాసీలను ఇబ్బందులకు గురి చేయడం భావ్యం కాదన్నారు.ఆదివాసుల సమస్యలను పరిష్కరించడానికి త్వరలో జాగృతి ఆధ్వర్యంలో గవర్నర్ దగ్గరికి వెళ్తామన్నారు.జిల్లాలో ఉన్న అతి పురాతనమైన జైనథ్ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఆలయ అభివృద్ధి కోసం స్థానిక ఎంపీ నగేష్, ఎమ్మెల్యే శంకర్ శ్రద్ధ పెట్టాలన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు రాముడు పేరుతో ఓట్లు అడిగే బీజేపీ నాయకులు లక్ష్మీ నారాయణుడు కొలువున్న జైనథ్ ఆలయాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ప్రజాప్రతినిధులు శ్రద్ధ పెడితే ఆలయ కోనేరు ప్రాంతాన్ని అభివృద్ధి పరిచి మంచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చన్నారు. అలాగే ఆదిలాబాద్ఆర్మూర్ రైల్వే లైన్ కోసం కృషి చేయాలన్నారు. ఎయిర్ పోర్ట్ కోసం భూసేకరణ గ్రామాల మధ్యలో చేయవద్దని సూచించారు. పత్తి సోయా వరి రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. అనంతరం రిమ్స్ ఆసుపత్రి సందర్శించి రోగులతో మాట్లాడారు.

# అమరుడు వీటి అబ్రహం సేవలు కార్మిక వర్గం మర్చిపోలేనివి

## నిరంతరం కార్మిక వర్గ ప్రయోజనాలకు పరుతపించేవారు

## మందమర్రి ఏ ఐ టి యు సి బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ

**మందమర్రి, మహా :** అమరుడు కామ్రేడ్ వీటి అబ్రహం సేవలు కార్మిక వర్గం మర్చిపోలేనివని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి మందమర్రి బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ కీర్తించారు. మంగళవారం కామ్రేడ్ వీటి అబ్రహం 41వ వర్ధంతి సందర్భంగా యూనియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అక్కడినుండి యూనియన్, సిపిఐ పార్టీ శ్రేణులు, అభిమానులు మందమర్రి మార్కెట్ లోని వీటి అబ్రహం స్తూపం వరకు ర్యాలీగా పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో జన్మించిన వీటి అబ్రహం ఉన్నత చదువులు అభ్యసించి కార్మిక వర్గ ప్రయోజనాల కొరకు మందమర్రిలో ట్రేడ్ యూనియన్ బాధ్యతలు చేపట్టారని అన్నారు. గతంలో మందమర్రి ప్రాంతం భూస్వాములు గుండాల ఆధిపత్యంలో ఉండేదని వెల్లడించారు. ఆ క్రమంలో భూస్వాములను, గూండాలను





ఎదిరించి భారత కమ్యూనిస్టు పార్టీ ఎదుగుదలకు పునాదులు వేశారని అన్నారు. నిరంతరం కార్మిక వర్గ ప్రయోజనాలకు పరుతపించేవారని స్పష్టం చేశారు. 1984 సంవత్సరం నవంబర్ 4న సికాస కసాయిలు కామ్రేడ్ వీటీ అబ్రహంను అతి కిరాతకంగా దాడి చేసి హతమార్చారని తెలిపారు. సింగరేణి కార్మిక వర్గం ఉన్నంతకాలం అమరుడు వీటీ అబ్రహం ఆశయాలు ముందుకు కొనసాగుతూనే ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భీమనాధుని సుదర్శన్, ఎండి అక్బర్ అలీ, దాగం మల్లేష్, సోమిశెట్టి రాజేశం, ఇప్పకాయల లింగయ్య, కంది శ్రీనివాస్, పెద్దపల్లి బానయ్య, రాజేశ్వరరావు, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, పిట్ కార్యదర్శి సిహెచ్చి శర్మ, కల్వల శ్రీనివాస్, రాయబారపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లపై సమీక్షా సమావేశం

**ఆదిలాబాద్ మహా :** రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లపై జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో పత్తి కొనుగోళ్లు సజావుగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజార్షి షా తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యజమానులు, మార్కెటింగ్, వ్యవసాయ, రవాణా, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో పత్తి కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లులు నవంబర్ 6వ తేదీ నుండి నిరవధికంగా మూసివేయనున్నట్లు తెలంగాణా కాటన్ జిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ ప్రకటించిన నేపథ్యంలో, జిల్లా స్థాయిలో పరిస్థితులను సమీక్షించామని తెలిపారు. సీసీఐ వారు జిన్నింగ్ మిల్లులకు జాబ్ వర్క్ కేటాయింపును ఎల్ 1, ఎల్ 2 విధానంలో నిర్వహించడం పట్ల మిల్లుల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారని, ఈ అంశంపై జిల్లా స్థాయి కమిటీ చర్చించి అభిప్రాయాలను రాష్ట్ర స్థాయికి నివేదించనున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ముంబాయి) స్థాయిలో తీసుకునే తుది నిర్ణయం ప్రకారం పత్తి కొనుగోళ్లు కొనసాగుతాయని తెలిపారు. రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియ ఎటువంటి అంతరాయం లేకుండా జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే సీసీఐ నవంబర్



3వ తేదీ నుండి ఎకరాకు పత్తి కొనుగోలు పరిమితిని 11.74 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్లకు తగ్గించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి మార్కెటింగ్ శాఖ నిర్ణయం వచ్చిన తరువాత, సాఫ్ట్‌వేర్‌లో ఎకరానికి 7 క్వింటాళ్లకు మించి దిగుబడి ఉన్న రైతుల పత్తి కొనుగోళ్లు సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారి ధృవీకరణతోనే అనుమతిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పత్తి మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని, తగిన రవాణా, అగ్నిమాపక, భద్రతా చర్యలను చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, విశ్రాంతి ఏర్పాట్లు, పారదర్శకతకు కట్టుబడి ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, అదనపు ఎస్పీ సురేందర్ రావు, మార్కెటింగ్ అధికారి గజానన్, జిన్నింగ్ మిల్లుల యజమానులు, అధికారులు పాల్గొన్నారు.

# వైన్స్ షాప్ వద్దు మహాప్రభో...!!

**మందమర్రి మహా :** మందమర్రి మున్సిపాలిటీ 19వ వార్డులో వైన్స్ షాప్ వద్దు మహాప్రభో...!! అంటూ మంగళవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎక్సైజ్ శాఖ సీఐ ఇంద్రసేన కు 19 వ వార్డు వ్యాపారస్తులు వినితి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబాలు విశ్రాంతి తీసుకునే ప్రాంతంలో వైన్ షాపు తెరవడాన్ని రద్దు చేయాలని వారు విన్నవించారు. ఈ ప్రాంత వాసులమైన మేము ఇక్కడే పుట్టి పెరిగి చదువుకొని మంచి విలువలతో కూడిన జీవన విధానాన్ని పాటిస్తున్నామని వెల్లడించారు. ఉద్యోగాలు రానప్పటికి మా స్వంత నిధులతో వ్యాపారాలు స్వీట్ హౌస్, మెడికల్ షాప్, టిఫిన్ సెంటర్, డిటిపి అండ్ జిరాక్, భ్యూటి పార్లర్, కుడివైపు నాలుగు కుటుంబాలు, వెనుక వైపు ఐదు కుటుంబాలు, ఎడుమపక్క ఐదు కుటుంబాలు నివసిస్తున్నాయని అన్నారు. మేము గత 25 సంవత్సరాల నుండి ఇక్కడనే నివసిస్తున్నామని తెలిపారు. మా కుటుంబాలలో విద్యను అభ్యసించే ఆడ, మగ పిల్లలు, వృద్ధులు, గృహినిలు ఉన్నారని పేర్కొన్నారు. ఇప్ప



టికే ఈ ప్రాంతంలో 2 వైన్స్ షాపులు ఉండగా మా నివాస ప్రాంతాలలోకి తాగుబోతులు మద్యం తాగి నివాస గృహాల ముందర మూత్రవిసర్జన చేస్తున్నారని వాపోయారు. తద్వారా దుర్వాసన వెదజల్లడం ద్వారా ఇంట్లో నుండి బయటకు రాలేకపోతున్నామని వివరించారు. మా అభ్యర్థనను స్వీకరించి కొత్తగా ఏర్పడే బ్రాందీ షాపును అడ్డుకుని మాకు న్యాయం చేయగలరని వారు వేడుకున్నారు. వీటి ప్రతులను మంచిర్యాల జిల్లా కలెక్టర్, డిసిపి, మందమర్రి మున్సిపల్ కమిషనర్, స్థానిక పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, రమేష్, శంకర్, సత్తయ్య, ఏ తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

## ఆలయాల్లో పూల మొక్కలు

# వికాసాన్ని అందిస్తాయి

**మందమర్రి, మహా :** ఆలయాల్లో పూల మొక్కలు వికాసాన్ని అందిస్తాయని సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధా కృష్ణ అన్నారు. మంగళవారం శ్రీ వెంకటేశ్వర దేవాలయం ఆవరణలో సింగరేణి పాఠశాల విద్యార్థులతో కలిసి పూల మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరు ఒక్కో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పూల ద్వారా మానసిక ఉల్లాసం, ప్రశాంతత దొరుకుతుందని పేర్కొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణం అంతా అధికారులు, అర్చకులతో కలియతిరిగారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏ.ఐ.టి.యు.సి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి జా, డీ.జీ.ఎం ఈ అండ్ ఎం దూప్ సింగ్, డీజీఎం ఎఫ్ అండ్ ఏ ఆర్ వి ఎస్ ఆర్ కె ప్రసాద్, సివిల్ ఎస్.ఈ రాము, ఫారెస్ట్ అధికారి నవీన్ కుమార్, పర్యావరణాధికారి వెంకట్ రెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో సాయి భోజన్

## ..గర్భిణులకు బాలింతలకు డయాలసిస్ పేషెంట్లకు అన్నదానం

## ..బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సహకారంతో గర్భిణులకు బాలింతలకు, డయాలసిస్ రోగులకు,అన్నార్తులకు సాయి భోజన్ అన్నదానం చేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్‌రాజేశ్వరి పేర్కొన్నారు .ఈ సందర్భంగా ఆస్పత్రిలోని, గర్భిణీలు, బాలింతలు, రోగులు, అన్నార్తులు, ఆసుపత్రి సిబ్బంది, సాయిభోజన్ అన్నదాన కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వారందరూ అన్నదానం చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, బాయిజమ్మ సాయి సేవా ట్రస్ట్ వారికి మరియు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.ట్రస్ట్ ద్వారా "ఆకలితో ఉన్నవారిని అతిథిసత్కారంతో ఆదరిద్దాంఅన్నదానంతో తృప్తి పరుద్దాం" అని ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్



కాంపల్లిశంకర్ రాజేశ్వరి వెల్లడించారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొసాగుతుందని,మానవ సేవే మాధవ సేవ అని త్రవిద్య, శ్రవిద్య, త్రయాక్షర్ తెలిపారు ఈ సేవా కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్, సభ్యులుజేరిపోతుల చంద్రకళ సేవకులు పోతరాజుల తిరుపతి ఆరెల్లి కుమార్, కోదాటి మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# నిర్లక్ష్యపు నీడలో పల్లె ప్రకృతి వనాలు

**ఆదిలాబాద్, మహా:** పల్లె ప్రకృతి వనాలు నిర్లక్ష్యపు నీడలో మగ్గుతున్నాయి.తలమడుగు మండలంలోని పలు గ్రామాల్లో వీటి నిర్వహణను అధికారులు గాలికి వదిలేసారు. పల్లె ప్రకృతి వనాలలో కొద్దిసేపు సేద తీరుదామని వెళితే నిరాశే మిగులుతుంది. ప్రస్తుతం పట్టించుకునేవారు లేక పల్లె ప్రకృతి వనాల పరిస్థితి అయోమయంగా మారింది .ఎక్కడ చూసిన పిచ్చి మొక్కలు నీటి గుంతలే దర్శనమిస్తున్నాయి. పైగా నీటిలో దోమలు సైర్య విహారం చేస్తూ కనిపిస్తున్నాయి. అధికారులు సరైన చర్యలు చేపట్టి ఉంటే ఈ దుస్థితి ఉండేది కాదని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్ళు సమర్థవంతంగా నిర్వహించాలి

## మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య

**మంచిర్యాల, మహా :** వరి ధాన్యం కొనుగోళ్ళు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ భవనంలో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 26 సంవత్సరం వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లాలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 150, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 97, డి. సి. ఎం. ఎస్. ఆధ్వర్యంలో 63, మెప్మా ఆధ్వర్యంలో 7 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలో అంచనా 1 లక్ష 57 వేల 642 ఎకరాలలో వరి సాగు జరిగి 2 లక్షల 32 వేల 743 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర ప్రకటించినట్లు చెప్పారు. సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కొరకు జిల్లాలో 58 లక్షల 18వేల 575 గోనె సంచులు అవసరం కాగా ప్రస్తుతం 31 లక్షల 35 వేల 243 గన్ని సంచులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వాటితో పాటు 6 వేల 409 టార్పాలిన్లు, 90 ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్లు, 447 తేమ యంత్రాలు, 493 ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, 285 డయల్ కాలిపర్స్, 285 హస్క్ రిమూవర్స్, 48 మాన్యువల్ ప్యాడి క్లీనర్లు, 2 ప్యాడి డ్రైవర్లు మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పంట పూర్తి పక్వానికి వచ్చిన తర్వాత కోసినట్లయితే నాణ్యత ప్రమాణాలకు అణువుగా ఉంటుందని చెప్పారు. రైతులు ప్రభుత్వ నిర్దేశిత నాణ్యత ప్రమాణాల మేరకు ధాన్యాన్ని ఆరబోసి, శుభ్రపరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల వద్ద వ్యవసాయ విస్తరణ అధికారులతో టోకెన్లు పొంది సకాలంలో ధాన్యం విక్రయించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో జి పి ఓ లు, క్లస్టర్ స్థాయిలో ప్రత్యేక అధికారులు, మండల స్థాయిలో తహసిల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ స్థాయిలో మంచిర్యాల నియోజకవర్గానికి రాజస్వ మండల అధికారి, బెల్లంపల్లి నియోజకవర్గానికి సబ్ కలెక్టర్, చెన్నూర్ నియోజకవర్గానికి ప్రత్యేక గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ లను నియమించి కొనుగోలులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సన్న రకం వడ్లకు బోనస్ ఇస్తున్నందున అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కొనుగోలు ప్రక్రియలు అవకతవకలు జరిగినట్లయితే సంబంధిత కేంద్రాల నిర్వహకులు, అధికారులు, రవాణా గుత్తేదారులు, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు.





## ఇందిరమ్మ ఇళ్ళ పథకానికి మీ సేవ పోర్టల్ ద్వారా

# దరఖాస్తు చేసుకోవాలి

## బెల్లంపల్లి తహసిల్దార్ ఎల్ .కృష్ణ

**బెల్లంపల్లి, మహా:** అర్హులైన పేదలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తున్న రెండు పడక గదుల ఇందిరమ్మ ఇళ్ల పథకానికి మీసేవ పోర్టల్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి తహసిల్దార్ ఎల్.క్రిష్ణ సూచించారు.ఈ సందర్భంగా మంగళవారం రోజు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6 తేదీ నుండి 16వ తేదీ వరకు మీసేవ పోర్టల్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సంబంధిత అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్ కార్డు,రేషన్ కార్డు,కుల ధ్రువీకరణ పత్రము, ఆదాయ ధ్రువీకరణ, పత్రము, మొబైల్ నెంబర్ తోపాటు స్థలం కలిగిన వారు సంబంధిత స్థల వివరాలను మీసేవ పోర్టల్ ద్వారా అప్లోడ్ చేయాలని వెల్లడించారు.


# కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులకు సకల సౌకర్యాలు

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** కార్తీక పౌర్ణమి సందర్భంగా గూడెం గుట్ట శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. మంగళవారం ఆలయ ఈ.ఓ. శ్రీనివాస్ తో కలిసి సత్యనారాయణ స్వామిని దర్శించుకుని కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయానికి దాదాపు 1 లక్ష మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పోలీసు బందోబస్తు, త్రాగునీరు, భారీకేడ్లు, ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అగ్నిమాపక వాహనాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. భక్తులకు అవసరమైన పూజ స్థలం, సిబ్బంది అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని ద్వారక గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలో చేపట్టిన షెడ్యూల్డ్ తెగల సంక్షేమ వసతి గృహ భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా



చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాఠశాలను సందర్శించి తరగతి గదులు, మధ్యాహ్న భోజన నిర్వహణ, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని అన్నారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు ఉన్నందున విద్యార్థుల సంఖ్య పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలు, విద్యా బోధన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# టోంకిని హనుమాన్ మహా పాదయాత్ర

**సిర్పూర్, మహా :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ మండలంలోని ప్రసిద్ధ శ్రీ సిద్ధి టోంకిని హనుమాన్ ఆలయానికి ఈ ఏడాది మహా పాదయాత్ర మంగళవారం తెల్లవారుజామున ఘనంగా ప్రారంభమైంది. కాగజ్‌నగర్ నుండి ప్రారంభమైన ఈ పాదయాత్రలో వందలాది మంది భక్తులు పాల్గొని, జై హనుమాన్ నినాదాలతో మార్మోగించారు.భక్తులు 26 కిలోమీటర్ల దూరం నడుస్తూ, మార్గమంతా భజనలు పాడుతూ, మంత్రోచ్చారణలతో ముందుకు సాగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, సేవా సంస్థలు భక్తులకు తాగునీరు, శీతల పానీయాలు, ప్రసాదం అందించి సేవాభావాన్ని ప్రదర్శించారు.టోంకిని హనుమాన్ ఆలయం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటి. పురాణ కథల ప్రకారం, ఇక్కడి హనుమంతుడి విగ్రహం దక్షిణాభిముఖంగా ఉండటం ఈ ఆలయ ప్రత్యేకత. ప్రతీ సంవత్సరం దీపావళి సమయానికి వేలాది మంది భక్తులు పాదయాత్రగా ఆలయానికి చేరుతారు.భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు విస్తృతంగా చేశారు. భక్తులు సౌకర్యవంతంగా పాదయాత్ర పూర్తి చేసేలా స్థానిక అధికారులు పర్యవేక్షణ చేపట్టారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయాయి. ఎక్కడ చూసినా జై హనుమాన్ నినాదాలు మార్మోగి భక్తిశ్రద్ధలతో నిండిన దృశ్యాలు దర్శనమిచ్చాయి.

# ఆదివాసుల భూముల జోలికొస్తే ఖబడ్దార్

**సిర్పూర్, మహా :** కొమురం భీం ఆసిఫాబాద్ ఆదివాసీల భూములను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుర్స పొచ్చయ్య హెచ్చరించారు.జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన నేర్పల్లి పొశం, కన్నెపెల్లి బాపు, కన్నెపెల్లి పొశం లకు చెందిన భూములను మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కనుకుంట్ల రమణ, బెంగాలీ వ్యక్తి కౌశిక్ అక్రమంగా కబ్జా చేశారని తెలిపారు.ఆదివాసీలు తమ భూములను దున్నేందుకు వెళ్లినా వారిని భయపెట్టి, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



భూకబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకుని, బాధిత ఆదివాసీలకు న్యాయం చేయాలని ఎస్పీ, కలెక్టర్‌లను కోరారు.భూములు తిరిగి ఇవ్వకపోతే తుడుం దెబ్బ మరియు ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని బుర్స పొచ్చయ్య హెచ్చరించారు.

# దొనబండ వార్డెన్‌ను విధుల నుంచి తొలగించాలి

## పి.డి.ఎస్.యు. జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారికి వినతి

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా దొనబండ సాంఘిక సంక్షేమ హాస్టల్ వార్డెన్ ను విధుల నుంచి తొలగించాలని. పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు డి శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు పి సికిందర్ లు డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాల జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి (ఎస్సీ డి.డి.ఓ) దుర్గ ప్రసాద్ కు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డెన్ విద్యార్థులపై దురుసుగా ప్రవర్తిస్తుందని విమర్శించారు. విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల పట్ల ప్రేమ మమకారాలు లేని విధంగా వ్యవహరి



స్తుందని మండిపడ్డారు. తక్షణమే వార్డెన్ ను విధుల నుండి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. నాయకులు కే కార్తీక్, అంజి, అంజి పటేల్ పాల్గొన్నారు.

# జిల్లాలో పోలీస్ అక్క కార్యక్రమానికి శ్రీకారం

**ఆదిలాబాద్, మహా:** మహిళలు, విద్యార్థినుల రక్షణ, భద్రత కోసం జిల్లాలో మొట్ట మొదటిసారిగా పోలీస్ అక్క కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కళాశాలలో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.మహిళలు విద్యార్థినుల రక్షణకై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు ఆయన తెలిపారు.ప్రతి పోలీస్ స్టేషన్ కు చెందిన ఒక మహిళ పోలీసు కానిస్టేబుల్ చే పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు, వారిపట్ల జరిగే నేరాలపై అవగాహనను కల్పించనున్నారని తెలిపారు. విద్యార్థినిలకు గుడ్ టచ్ , బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థినిలు ధైర్యంగా తమ తోబుట్టువుతో మాట్లాడుతున్నట్టు పోలీసు అక్క కు తమ సమస్యలు చెప్పుకోవాలన్నారు. విద్యార్థులలో ధైర్య సహాసాలు పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి ఒక్క పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పోలీస్ స్టేషన్ కు సంబంధించినటువంటి మహిళా పోలీసు వారానికి రెండు,మూడు రోజులు పలు పాఠశాలలను సందర్శించి వారితో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు, అదేవిధంగా గ్రామాలను సైతం సందర్శిస్తూ మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా జిల్లాలో మొట్టమొదటిసారిగా ప్రారంభించిన ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం విద్యార్థుల తమ జీవితంలో వారి పట్ల జరిగిన అన్యాయాలను అఘాయిత్యాలను ధైర్యంగా జిల్లా పోలీసుల కు సమాచారం అందించాలని వారిలో ధైర్యసాహసాలను పెంపొందించడానికి తమ వంతు ప్రయత్నం గా ఈ కార్యక్రమం కొనసాగనుందని తెలిపారు. ఎట్టి





పరిస్థితుల్లోనూ విద్యార్థులకు జరిగిన అన్యాయాలు మరుగున పడకుండా ఇతరులకు అదే రీతిలో అన్యాయాలు జరగకుండా అడ్డుకోవడానికి జిల్లా పోలీసు యంత్రాంగం పోలీసు అక్క పేరుతో విద్యార్థులకు దగ్గరై ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ లపై, రోడ్లపై ఆకతాయిల వేధింపులపై, బాల్యవివాహాలపై, సోషల్ మీడియా వేధింపులపై, ఫేక్ సోషల్ మీడియా ద్వారా విద్యార్థులకు ఇబ్బందులు కలిగించడం, ప్రేమ పేరుతో వేధింపులు, ఫోటోలను వీడియోలను తీసుకొని వాటి ద్వారా బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడడం లాంటి వాటిని ధైర్యంగా జిల్లా పోలీసుల దృష్టికి తీసుకురావాలని వారి పేర్లను బయటకు రాకుండా సరైన న్యాయం చేసే దిశగా జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు.అదేవిధంగా విద్యార్థినిలకు జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా చేయవలసిన కృషి పట్ల అదేవిధంగా విజయానికి కావలసినటువంటి పట్టుదల, క్రమశిక్షణ సమయపాలన ఇలాంటి అంశాలపై వివరణ, ముఖ్యంగా మహిళలు తమ రక్షణకై తమ భద్రతకై తీసుకోవాల్సిన అంశాలు వివరించనున్నారు. విద్యార్థులు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా జిల్లా షీ టీం బృందాలను లేదా డయల్ 100 ద్వారా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. షీ టీం కు సంప్రదించాలంటే 8712659953 నెంబర్ కు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. పోలీస్ స్టేషన్కు రాకుండా కేవలం సమాచారం ద్వారా తమ సమస్యలను పరిష్కరించే దిశగా పోలీసులు సరికొత్త నూతన విధానాలను అవలంబిస్తున్నట్లు మహిళలకు విద్యార్థులకు పూర్తి సహాయం అందిస్తూ జిల్లా పోలీసు యంత్రాంగం అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఉట్నూర్ కాజల్ సింగ్ ఐపీఎస్, డి.ఎస్.పి ఆదిలాబాద్ ఎల్ జీవన్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ లలిత కుమారి, పట్టణ సిఐలు కర్ర స్వామి, బి సునీల్ కుమార్, కే ప్రభాకర్, కె నాగరాజు, ప్రణయ్ కుమార్, ప్రేమ్ కుమార్, అంజమ్మ, పోలీసు అక్క కార్యక్రమం విమెన్ కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎవరొచ్చి చేసేది ఏముంది మన రోడ్డును మనమే బాగు చేసుకుందాం

## నడుము కట్టి రోడ్డును బాగు చేసిన యువత, ఫామ్హౌస్ నిర్వాహకులు.. రోడ్డుపై మొరం పోసి మారమ్మత్తులు చేశారు



**మొయినాబాద్, మహా:** అదిగో రోడ్ మంజూరు అయింది...ఇదిగో వస్తుంది... రోడ్ పనులు తొందరగా మొదలు పెడుతారు. అనే మాటలు ఏడాది నుంచి వింటున్న మాటలు... రోడ్ అవుతాదని ఆశపడిన ఇరు గ్రామాల ప్రజలు.. రోడ్డు పనులు కావని నిరాశ చెందారు... సురంగల్ గ్రామానికి చెందిన కొంత మంది యువత రోడ్డు ద్వారా వెళ్లే కొన్ని ఫామ్ హౌస్ నిర్వాహకులతో కలిసి రోడ్ మరమ్మతులు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని సురంగల్ గ్రామం నుంచి మొయినాబాద్ పరిధిలోని శ్రీరామ్ నగర్ గ్రామాల మధ్య ఉన్న రోడ్డు గుంతలు ఏర్పడి పూర్తిగా ధ్వంసం అయింది. బిటి రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంతో ఫీట్ లోతు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. పంచాయతీరాజ్ శాఖలో ఉన్న రోడ్డు ఆర్ అండ్ బి శాఖ పరిధిలోనికి ఇటీవలనే మార్చుతూ..ఉత్తర్వులు కూడా వెలబడ్డాయి.కానీ ఇప్పటి వరకు రోడ్డు పనులు జరగడం లేదు. గుంతల మాయంగా మారిన రోడ్డు వలన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే బురద మయంగా మారుతుంది. వాహనదారులు ఇబ్బందులు పడుతుంటే సరంగల్ గ్రామానికి చెందిన కొంత మంది యువకులు స్వచందంగా ముందుకొచ్చారు. ఫామ్ హౌస్ నిర్వాహకుల సహకారం కూడా తీసుకొని 2 కిలో మీటర్ల దూరం వరకు మొరం పోసి గుంతలు పూడ్చి మారమ్మత్తులు చేశారు. రోడ్డును బాగు చేసిన యువకులను వాహనదారులు అభినందించారు

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతిపౌరుడి కర్తవ్యం

## రోడ్డు భద్రతపై వార్డు కమిటీ అవగాహనస దస్సులో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ & వన్ టౌన్ శ్రీనివాసరావు



**బెల్లంపల్లి, మహా:** రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి పౌరుడి కర్తవ్యంగా భావించి నడుచుకోవాలని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ సూచించారు.మంగళవారం రోజున బెల్లంపల్లి పట్టణ వన్ టౌన్ సిఐ కే. శ్రీనివాసరావు రోడ్డుభద్రతపై వార్డ్ కమిటీ ఏర్పాటు అవగాహన సదస్సు నిర్వహించగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసిపి రవికుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుప్రమాదాల నివారణ ప్రతి పౌరుడి బాధ్యతని నివారించడానికి ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐ శ్రీనివాస రావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో సంభవించిన రోడ్డుప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని పలుసూచనలుచేశారు.వాహనదారుడు ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉంటూ కారులో వెళ్లేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని,మోటార్ సైకిల్ పైన వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,మద్యం సేవించి వాహనం నడపడం చాలా ప్రమాదకరమని అది క్షమించరాని నేరంఅని,రోడ్డుపై వెళ్లేటప్పుడు అతివేగంగా వెళ్లకుండా ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ఉండాలని, త్రిబుల్ రైడింగ్ కూడా రోడ్డు ప్రమాదాలకు కారణం అని సూచిస్తూ వాహనదా రుడు ప్రతి ఒక్కరు కూడా డ్రైవింగ్ లైసెన్స్ లు కలిగి ఉండాలని,వాహనా న్ని నడిపే ప్రతి ఒక్క వాహనదారుడు వాహనానికి సంబంధించిన ప్రతిడాక్యు మెంటును కలిగి ఉండాలని మరియు వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.ముఖ్యంగా ఇటీవలి కాలం లో జరిగిన రోడ్డు ప్రమాదాల గురించి వివరిస్తూ వాటిలో ఎక్కువగా యువత అతివేగంగా నడపడం,మద్యం సేవించి నడపడం,మత్తు పదార్థాల ను సేవించి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారని వివరించారు.

డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ఫోన్ వాడకూడదని,అలా చేయడంవల్ల ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు.వాహనదారుడు పాఠశాల వద్ద,ఆస్పత్రుల వద్ద, జనసమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో హారన్ ను ఉపయోగిస్తూ నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. రోడ్డు మలుపుల వద్ద,జంక్షన్ల వద్ద స్పీడ్ తగ్గించుకొని వెళ్లాలన్నారు.పోలీసు వారు వెహికల్ చెకింగ్ మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించేది రోడ్డు ప్రమాదాల నివారణ కోసమేనని ప్రజలు అర్థంచేసుకొని పోలీసుల కి సహకరించాలన్నారు.బెల్లంపల్లి ఏసీపీ ప్రసంగిస్తూ వాహనాలు నడిపే ప్రతి ఒక్క డ్రైవరు డ్రైవింగ్ లైసెన్స్ తోపాటు సంబంధిత డాక్యుమెంట్లను కచ్చితంగా కలిగి ఉండాలన్నారు.వాహనదారులుఎప్పుడుకూడా నిర్లక్ష్యం చేయకుండా ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఏదైనా ప్రమాదం సంభవిస్తే దానివల్ల జరిగే నష్టం పూడ్చలేనిదని ప్రమాదానికి గురైన వ్యక్తుల కుటుంబాలు రోడ్డున పడి అనాథలు కాకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ పోలీసులకి సహకరిస్తూ రోడ్డుప్రమాదాలు సంభవించకుండా తమవంతు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిఐ కే శ్రీనివాసరావు స్వయంగా రోడ్డు భద్రత కు సంబంధించిన ప్రతిజ్ఞను చదివి కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరి చేత ప్రతిజ్ఞ చేయించారు.కార్య క్రమంలో బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, వన్ టౌన్ సిఐ కె శ్రీనివాసరావు,పోలీసు సిబ్బంది, బెల్లంపల్లి పట్టణ వార్డు మాజీ కౌన్సిలర్లు గెల్లి రాజలింగు,ఆటో డ్రైవర్లు,ఇతర వాహనదారులు, ప్రజలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# రంగారెడ్డి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడి జన్నాల పద్మావతికి ఘనంగా సన్మానం

- ప్రభుత్వం దళితులకు సబ్సిడీతో కూడిన లోన్ మంజూరు చేయాలి
- ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బేగరి రాజు

**మొయినాబాద్ మహా:** రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ ప్రాంతంలో ఉన్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జన్నాల పద్మావతిని మంగళవారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బేగరి రాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఎస్సీ కార్పొరేషన్ పనిచేస్తుందని దళితులకు ప్రభుత్వం సబ్సిడీతో కూడిన లోన్లు ఇచ్చి దళితుల అభివృద్ధికి ఆర్థికంగా ఎదిగే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సినియర్ పాత్రికేయులు అలమనేటి గోపాల్, జగదీష్ నేత, చీమల సురేందర్ పాల్గొన్నారు

# హరీశ్ రావును పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి బీఆర్ఎస్ నాయకులు, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దారెడ్డి వెంకట్ రెడ్డి తో కలిసి మాజీ మంత్రి హరీష్ రావును పరామర్శించారు. హైదరాబాద్ లోని హరీష్ రావు నివాసంలో దివంగత సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హరీష్ రావు తండ్రి సత్యనారాయణ మృతి పట్ల ఆయనను పరామర్శించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# బీజాపూర్ జాతీయ రహదారి పనులు ప్రారంభించాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సిపిఎం, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో, అప్ప జంక్షన్ నుండి మన్నెగూడ వరకు వెంటనే రోడ్డుపనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ... నిన్న జరిగిన ప్రమాదం అందరి హృదయాలను కలచివేస్తోందని అన్నారు. బీజాపూర్ జాతీయ రహదారి పై పడిన గుంతలను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం [illegible] ప్రకటించిందని, వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు అనాధలు అయ్యారని, ఆ పిల్లల సంరక్షణ పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని అన్నారు. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిందని అన్నారు. మృతి చెందిన కుటుంబాలకు 25 లక్షల ఎక్స్గ్రేషన్ చెల్లించాలని, గాయపడిన వారికి పది లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు స్పందించి అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రోడ్డు వెంటనే పూర్తి అయ్యేలా కృషి చేయాలని కోరారు. లేని పక్షంలో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. జగదీశ్, సిపిఎం పార్టీ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, అధ్యక్షుడు శ్రీనివాస్ సిఐటియు ట్రాన్స్పోర్ట్ యూనియన్ అధ్యక్షులు రమేష్ ప్రధాన కార్యదర్శి నవాజ్ కోశాధికారి శ్రీశైలం ఉపాధ్యక్షులు వెంకట్రాములు మహేందర్ ఊరెళ్ళ రాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ..యువజనోత్సవం

**ఆదిలాబాద్, మహా:** జిల్లా యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఆదర్శంగా నిలవాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని జడ్పీ సమావేశ మందిరంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలు కార్యక్రమాని ఆయన హాజరైన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు, యువత, కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఆదిలాబాద్ జిల్లా అన్ని రంగాల్లో ముందుండాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థి దశలోనే మంచి మార్గంలో నడవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అందుకే జిల్లాలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమంను ప్రారంభించామని, ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో, జీవితంలో విజయం సాధించవచ్చని అన్నారు. ఉన్నత విద్యాపరంగా విద్యార్థులు ఐఐటీ, నీట్, జెఈఈ లాంటి జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారిని ప్రోత్సహించే విధంగా స్టార్ 50, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, సంప్రదాయ కళల పట్ల యువత అవగాహన కలిగా ఉండాలన్నారు, గుస్సాడీ నృత్యానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కళాకారులు పొందిన పద్మశ్రీ పురస్కారం మనకు గర్వకారణమని తెలిపారు.

# నేడు మంచాలకు రానున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** ఆరుట్ల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ బుగ్గ లింగేశ్వర స్వామి సేవలో ఎమ్మెల్యే పాల్గొననున్నారు. నేడు కార్తీక పౌర్ణమి సందర్భంగా, మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలో ప్రారంభం కానున్న, శ్రీశ్రీశ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర, తొలి పూజా కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్ననున్నారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమంలో.... ఇబ్రహీంపట్నం కేంద్రంలోని, వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకెపి సెంటర్ల ద్వారా ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నారు. అబ్దుల్లాపూర్మెట్ మండలం, తారామతి పేట్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు హాజరుకానున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

## కార్పొరేటర్ తోకల



**రాజేంద్రనగర్, మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం లో అభివృద్ధి పనులో భాగంగా నూతనంగా నిర్మించిన సీ సీ రోడ్డు పనులను బిజెపి రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి అధికారులతో కలిసి మంగళవారం పర్యవేక్షించారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో పారిశుద్ధంపై అధికారులు నిర్లక్ష్యం వహించారని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించడంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు. పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట రోడ్డు పొడిగించి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తెవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్ రెడ్డి, ఎల్వీ రెడ్డి, రాజ్ కుమార్, రామకృష్ణ, పాండురంగారెడ్డి, భూపతిరెడ్డి, మల్లికార్జున్, బాబ్లు, మధుసూదన్ రెడ్డి, శంకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, అభి, శివ, చారి, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవలు అందించినప్పడే గుర్తింపు

## మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్



**మొయినాబాద్ మహా:** ఉద్యోగరీత్యా ప్రజలకు సక్రమంగా విధులు నిర్వహిస్తూ..సేవలందించినప్పుడే ప్రజలు ఉద్యోగులను గుర్తిస్తారని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో వార్డ్ ఆఫీసర్ గా పనిచేసిన వెంకయ్య, శంకర్ పల్లికి బదిలీ కావడంతో ఆయనకు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొయినాబాద్ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా మూడు సంవత్సరాలుగా పనిచేసిన వెంకయ్యను మొయినాబాద్ మున్సిపల్ కావడంతో మున్సిపల్ వార్డులో అధికారిగా సంవత్సరం పాటు విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శంకర్ పల్లికి బదిలీ కావడంతో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ పాల్గొని అధికారులతో సిబ్బందితో కలిసి సన్మానాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగరీత్యా ప్రజలకు సేవలు అందించిన వారిని అధికారిగా గుర్తిస్తూ.. ఎన్నటికీ మర్చిపోలేరని తెలిపారు. అందులో భాగంగా వెంకయ్య చేసిన సేవలు ప్రజలకు మరిచిపోలేక గుర్తుంటాయని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిఈ.చిరంజీవిలు, వార్డ్ ఆఫీసర్ జమీల్,అమర్, నరేందర్, సంధ్యారాణి, శ్రీనివాసరావు, సుదర్శన్ వెంకటేశ్వర రెడ్డి, కుమార్, అశోక్ వెంకటేశం బిల్ కలెక్టర్ శ్రావణ్ కుమార్, రాజేష్, రజిత మాధవి, రాణి, కంప్యూటర్ ఆపరేటర్స్ రాఘవేందర్, శేఖర్, మహేందర్, మల్లేష్, వీరేష్, నరేష్, ఆదోని అనార్, సుధాకర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ షాప్ల్లో డ్రగ్ ఇన్స్పెక్టర్ల తనిఖీలు



**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం డ్రగ్స్ కంట్రోల్ అధికారులు పలు మెడికల్ షాపులపై తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా మున్సిపాలిటీ పరిధిలో రంగారెడ్డి జోన్ డ్రగ్స్ అసిస్టెంట్ డైరక్టర్ జి ప్రసాద్ ఆధ్వర్యంలో మెడికల్ షాపులపై డ్రగ్స్ ఇన్స్పెక్టర్ పి. స్రవంతి రెడ్డి, అన్వేష్, శ్వేతా బిందు, శైలజ, రష్మి, నాగరాజు, పలు మందుల దుకాణాలపై దాడులు నిర్వహించి తనిఖీలు చేపట్టారు. దాడుల్లో నిబంధనలు ఉల్లంఘించిన 12 మెడికల్ షాప్ లను అధికారులు గుర్తించి,దుకాణాల నిర్వహకులకు షోకాస్ నోటీసులు జారీ చేశారు. లైసెన్స్ నిబంధనలు,మెడికల్ షాప్ల్లో ఉన్న మందులు, వాటి వివరాలను పరిశీలించారు. నాణ్యమైన మందులను విక్రయించాలని, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మెడికల్ షాప్లపై ఎటువంటి ఫిర్యాదులు అందినా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# మార్గదర్శనం చేసిన గురువులు విద్యార్థుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలి

## పదవి విరమణ సభలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ మండలం నర్కుడ గ్రామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రాంరెడ్డి పదవీ విరమణ సందర్భంగా, నర్కుడలోని ప్రవేట్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి విద్యారంగానికి చేసిన సేవలు మర్చిపోలేమన్నారు. ఆయన నిబద్ధతను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఈ సందర్భంగా కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శనం చేసే గురువుల పాత్ర అత్యంత కీలకమైనది, సమాజంలో వారికి ప్రత్యేక గౌరవం ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి ని శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. రాంరెడ్డి కి సుదీర్ఘకాలం ఆయురారోగ్యాలతో పదవీ విరమణ జీవితం గడపాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నిరటి తన్విరాజ్, మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సున్ని గంటి సిద్ధులు, మాజీ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

# కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి..

## సిఐటియు నాయకులు సామెల్



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో సిఐటియు మండలం ఆధ్వర్యంలో మంగళవారం 10, 11, న జరగాబోయే సిఐటియు జిల్లా నాల్గవ మహాసభను విజయవంతం చేయాలన్నారు. సందర్భంగా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం సిఐటియు నాయకులు వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకుడు జె సామెల్ మాట్లాడుతూ కార్మికుల చట్టాలను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వం కార్మికుల పట్ల చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. 44 చట్టాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం నాలుగు కోడ్ లుగా మార్చి కార్మికులకు తీరని అన్యాయం చేసింది. ఇలాగే కొనసాగితే కార్మికులకు ఉన్న హక్కులు పూర్తిగా పోతాయి. ఈ విధానాన్ని వెనక్కి తీసుకొని కార్మికుల న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ జిల్లా నాలుగవ మహాసభలో కేంద్ర ప్రభుత్వ రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీర్మానాలు చేసి మరో ఉద్యమాలకు సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలం నాయకులు జె సామెల, మున్సిపాలిటీ అధ్యక్షులు ప్రవీణ్, డి నాగేష్, జయేందర్, మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఇందిరా రవి పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తప్పవు

## ట్రాఫిక్ సిఐ ప్రమోద్ కుమార్



**రాజేంద్రనగర్ , మహా ;** ఆర్జిఐ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టారు. మొత్తం 14 కేసులు పరిష్కరించబడ్డాయి, ఫలితంగా మొత్తం జరిమానా 33,500/ విధించారు. కేసుల వివరణ, కారాగార శిక్ష,,, మద్యం సేవించి వాహనం నడిపిన ముగ్గురు వ్యక్తులపై 10 వ స్పెషల్ న్యాయస్థానము రాజేంద్రనగర్ లో హాజరు పరచగా వారికి జైలు శిక్ష , జరిమానా విధించారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి. హామీన్ అనె వ్యక్తి కి రోజుల సాధారణ కారాగార శిక్ష, 2500 జరిమానా. వి దీప్ సింగ్ అనే వ్యక్తి కి , 2 రోజుల సాధారణ కారాగార శిక్ష 2500 జరిమానా. ఎ వేణు గౌడ్ అనే వ్యక్తి కి, 2 రోజుల సాధారణ కారాగార శిక్ష 2500 జరిమానా. యన్ శ్రీనివాస్ అనే వ్యక్తి కి, 2 రోజుల సాధారణ కారాగార శిక్ష 2500 జరిమానా. యమ్ చందు అనే వ్యక్తి కి , 1 రోజు సామాజిక సేవ 2500 జరిమానా. దినేష్ అనే వ్యక్తి కి , 1 రోజు సామాజిక సేవ 2500 జరిమానా. 8, మందికి డ్రంక్ అండ్ డ్రైవింగ్ కింద జరిమానా మొత్తం 18500 జరిమానా విధించారు. 07 కేసులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడంతో జరిమానాలు మొత్తం 10500 విధించారు. 1 మైనర్ కేసు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కేసు నమోదు చేయబడ్డాయి, జరిమానా మొత్తం 1000 జరిమానా విధించారు. ఆర్జీఐ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ రహదారి భద్రతను నిర్ధారించడానికి ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయడానికి కట్టుబడి ఉందన్నారు. పౌరులందరూ వారి భద్రతను నిర్ధారించడానికి ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఆర్జిఐ ట్రాఫిక్ సిఐ ప్రమోద్ కుమార్ తెలిపారు.

# ప్రభుత్వ నిర్లక్ష్య నీడన వరుస రహదారి ప్రమాదాలు

## ఓవర్ లోడ్ రవాణాపై అధికారుల చర్యలేవీ?

- ఆర్టీసీ బస్సులకు ఫిట్నెస్, ఆక్యూపెన్సీ లిమిట్ వద్దా?
- ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలంటే లెక్కేలేదు
- ప్రభుత్వంపై ఫైర్ అయిన పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



**షాద్ నగర్, మహా:** నిన్న చేవెళ్ల మండలం, మీర్జాపూర్ దగ్గర జరిగిన టిప్పర్, బస్సు దుర్ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు వారి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, వరుసగా జరుగుతున్న రహదారి ప్రమాదాలకు ప్రభుత్వ రవాణా వ్యవస్థ నిర్లక్ష్యమే కారణమని ఫైర్ అయ్యారు. అనేక సంవత్సరాలుగా రద్దీగా ఉండే రహదారి విస్తరణ చేపట్టక వరుస ప్రమాదాలు జరుగుతున్న గత, ప్రస్తుత ప్రభుత్వాలు తమకు పట్టనట్లుగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఓవర్ లోడుతో వెళ్తున్న లారీలు, టిప్పర్లను రవాణా అధికారులు మామూళ్ల మాయలో పడి చూసి చూడనట్లుగా వదిలి వేయడం సామాన్యుల ప్రాణాలకు సంకటంగా మారిందని అన్నారు. ప్రభుత్వ ఉచిత హామీ వల్ల ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే మహిళ ప్రయాణికుల సంఖ్య పెరగడం కారణంగాను, ఆర్టీసీ బస్సులకు ఫిట్నెస్ లేకపోవడం కారణంగాను, అధికారుల నిర్వహణ లోపం వల్ల బస్సుల్లో వరుస ప్రమాదాలు జరగడం బాధాకరం అన్నారు. నిన్నటి ఘటన 20 కుటుంబాలను చిన్నాభిన్నం చేసిందని, ఏమిస్తే ఆ కుటుంబాలకు న్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలు అంటే విలువే లేదని, ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని, వ్యవస్థలను గాడిలో పెట్టి ప్రజల ప్రాణాలను రక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు మోహన్ సింగ్, నరసింహ యాదవ్, సుధాకర్ అప్ప, కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, కొత్తూరు మండల అధ్యక్షులు అత్తాపూర్ మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.


# నిస్వార్థ సేవ సమాజంలో చైతన్యాన్ని నింపుతోంది

## ప్రజా సేవలో జన సందేశ్ ఫౌండేషన్ .. విద్యార్థులకు ఉచిత కళ్ళ అద్దాల పంపిణీ




**రంగారెడ్డి జిల్లా మహా:** మానవ సేవే మాధవ సేవ అనే మహత్తర భావంతో, జన సందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, విద్యార్థులకు ఉచిత కళ్ళ అద్దాల పంపిణీ చేశారు. రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం, లోయపల్లి గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు, దూరదృష్టి, సమీప దృష్టి వంటి, కంటి సమస్యలతో బాధపడుతున్నారని తెలుసుకున్న జన సందేశ్ ఫౌండేషన్ వారు, విద్యార్థులకు కొత్త వెలుగులు తేవాలని సదుద్దేశంతో, కంటి వైద్య నిపుణులైన వైద్యులచే ఉచిత పరీక్షలు నిర్వహించి, కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫౌండేషన్ చూపిన నిస్వార్థ సేవ సమాజంలో చైతన్యాన్ని నింపుతోంది. ఈ సందర్భంగా విద్యార్థులలో "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే స్ఫూర్తిని నింపింది. ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగును ప్రసారించే కళ్ళ సంరక్షణలో జన సందేశ్ ఫౌండేషన్ ఒక మార్గదర్శక సంస్థగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో జన సందేశ్ ఫౌండేషన్ చైర్మన్ గోగిరెడ్డి లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాన్నే భాషయ్య, డాక్టర్ మధుసూదనా రెడ్డి, బిజెపి ప్రధాన కార్యదర్శి కారింగు రాజు గౌడ్, బీజేవైఎం మాజీ మండల అధ్యక్షులు బండి రాజ గౌడ్, మాజీ వార్డ్ మెంబర్ పోలగోని రామచంద్రయ్య, ఆర్గనైజర్ అశ్వల బాలరాజు, కన్వీనర్ మోర శ్రీశైలం, మాజీ బూత్ అధ్యక్షులు సుంకర మహేష్ గౌడ్ గారు భాను, చెరుకు జగదీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి



**ఆమనగల్లు, మహా:** ఈ నెల 15న ఆమనగల్లు కోర్టులో జరగనున్న జాతీయ మెగా లోక అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని అమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. శనివారం మెగా లోక అదాలత్ విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి పోలీస్ అధికారులుతో అమనగల్లు కోర్ట్ భవనం లో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మెగా లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని కక్షి దారులతోపాటు, వాది ప్రతివాదులు తమ కేసులను రాజీపరచుకోవాలని కోరారు .సమావేశంలో ఆమనగల్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి జానకిరామ్, కడ్తాల్ ఇన్స్పెక్టర్ గంగాధర్, ఆమనగల్లు ఎస్సై వెంకటేష్, తలకొండపల్లి ఎస్సై ఏ శ్రీకాంత్, మాడుగుల ఎస్సై రాఘవేందర్ కోర్టు సిబ్బంది కోర్ట్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# దేశంలోనే ధనిక జిల్లాగా రంగారెడ్డి



తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా తలసరి స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీపీ పర్ క్యాపిటా) పరంగా భారతదేశంలో అత్యంత ధనిక జిల్లాగా అవతరించింది. పట్టణ అభివృద్ధి, మెట్రోపాలిటన్ మౌలిక సదుపాయాలు స్థానిక ఆర్థిక వ్యవస్థను ఎంతలా మార్చగలవో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అని కొందరు భావిస్తున్నారు. కొన్ని సర్వేల్లో వెల్లడించిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి జీడీపీ సుమారుగా రూ.11.46 లక్షలుగా ఉంది. ఇది భారతదేశంలో ఇతర జిల్లాల కంటే అత్యధికం కావడం గమనార్హం. గతంలో అగ్రస్థానంలో ఉన్న గురుగావ్ (హరియాణా), బెంగళూరు అర్బన్ (కర్ణాటక) వంటి జిల్లాలు కూడా రంగారెడ్డి కంటే ఈసారి వెనుకబడ్డాయి. అయితే తలసరి జీడీపీ జనాభాను బట్టి మారుతుంటుందని గమనించాలి.

**రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో నిలవడానికి కారణాలు**

**ఐటీ (IT) కారిడార్, టెక్ పార్కులు**

రంగారెడ్డి జిల్లాలో ఐటీ, ఐటీ అనుబంధ సేవల రంగం విపరీతంగా అభివృద్ధి చెందింది. సైబరాబాద్, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి హైదరాబాద్‌లోని ప్రధాన ఐటీ హబ్‌లకు ఈ జిల్లా ఆనుకొని ఉండటం లేదా ఆ హబ్‌లలోని కొంత భాగం జిల్లా పరిధిలో ఉండటం దీనికి ముఖ్య కారణం. ఇక్కడ అనేక ప్రముఖ టెక్ పార్కులు, బహుళజాతి సంస్థల (MNCs) కార్యాలయాలు, స్టార్టప్ కంపెనీలు నెలకొన్నాయి. ఈ ప్రాంతం అధిక వేతనాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల ఆకర్షణకు కేంద్రంగా మారింది.

**ఔషధ, బయోటెక్ పరిశ్రమలు**

రంగారెడ్డి జిల్లా చుట్టూ అనేక ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ క్లస్టర్లు ఉన్నాయి. దేశంలోనే అతి పెద్ద లైఫ్ సైన్సెస్ పరిశ్రమకు ఈ జిల్లా ముఖ్యమైన కేంద్రంగా మారింది. పెద్ద ఎత్తున పరిశోధన, అభివృద్ధి (R&D), ఉత్పత్తి యూనిట్లు ఇక్కడ ఉండటం వలన ఆర్థిక వ్యవస్థకు అధిక విలువ, ఉద్యోగ కల్పన జరుగుతోంది.

**రియల్ ఎస్టేట్ రంగం వృద్ధి**

ఐటీ, పారిశ్రామిక వృద్ధి ఫలితంగా రియల్ ఎస్టేట్ రంగంలో భారీ వృద్ధి నమోదైంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి ప్రధాన నగర ప్రాంతాల నుంచి మొదలైన రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు రంగారెడ్డి జిల్లాలోని హైఎండ్ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాపర్టీల వైపు విస్తరించాయి. భూముల ధరలు, ఆస్తుల విలువ పెరగడం కూడా జిల్లా తలసరి జీడీపీ పెరగడానికి ఒక ముఖ్య కారణం.

**మెరుగైన కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు**

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ జిల్లాలోనే ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు (ORR) వంటి అత్యాధునిక రహదారులు, మెట్రోపాలిటన్ మౌలిక సదుపాయాలు, మెరుగైన కనెక్టివిటీ (రవాణా) కారణంగా పెట్టుబడులను, వ్యాపార కార్యకలాపాలను ఈ ప్రాంతం ఆకర్షించగలిగింది. ఈ మౌలిక సదుపాయాలు పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు దోహదపడ్డాయి.



# ధరలు పెరుగుతాయ్..

## వెండికి ఫుల్ డిమాండ్!

భారతదేశంలో బంగారం ధరల మాదిరిగానే.. వెండి ధరలు కూడా గణనీయంగా పెరిగి, అక్టోబర్ నెలలో రూ. 2 లక్షలకు (కేజీ) చేరుకుంది. అయితే నేడు (నవంబర్ 4) సిల్వర్ రేటు రూ. 1.65 లక్షల వద్ద ఉంది. అంటే ఏ స్థాయిలో వెండి రేటు తగ్గిందో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. కానీ.. వెండి ధరలు భవిష్యత్తులో భారీ పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భారీగా పెరిగిన వెండి ధరలు, కొనుగోలుదారులను కొంత కలవరపెట్టినా.. ఇటీవల కొంత తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఎఎమ్‌సిలో ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీ ప్రిన్సిపల్ 'చింతన్ హరియా' మాట్లాడుతూ.. వెండిని ఆభరణంగా మాత్రమే కాకుండా.. పారిశ్రామిక రంగంలో కూడా ఉపయోగిస్తారు. కాబట్టి వెండి వినియోగం పెరుగుతుంది. తద్వారా రేటు పెరుగుతుందని అన్నారు. వెండికి డిమాండ్ పెరుగుతూ ఉండటం వల్ల.. గత మూడేళ్ళలో సిల్వర్ రేటు 30శాతం పెరిగిందని పేర్కొన్నారు. వెండిని.. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక శక్తి, టెలికాం, వైద్య సాంకేతికత, బయోఫార్మా వంటి పరిశ్రమలలో విరివిగా ఉపయోగిస్తున్నారు. అంతే కాకుండా.. సౌర ఫలకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ భాగాలలో కూడా సిల్వర్ కీలకంగా మారింది. ఇవన్నీ వెండి డిమాండును అమాంతం పెంచడంలో దోహదపడ్డాయి. ఇది ధరలను భారీగా పెంచే అవకాశం ఉందని చెబుతున్నారు.

**ఈరోజు సిల్వర్ ధరలు**

ఈరోజు (మంగళవారం) వెండి రేటు రూ. 3000 తగ్గింది. దీంతో హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు నగరాల్లో కేజీ సిల్వర్ రేటు రూ. 1.65 లక్షల వద్ద ఉంది. ఢిల్లీలో మాత్రం కేజీ వెండి ధర రూ. 1.51 లక్షల వద్ద ఉంది. దీన్నిబట్టి చూస్తే.. దేశంలోని ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే.. ఢిల్లీలో సిల్వర్ రేటు కొంత తక్కువ అని తెలుస్తోంది.

# ఒకటే బ్రాండ్.. లక్ష మంది కొన్నారు!




2020లో ఎంజీ మోటార్ కంపెనీ.. జెడ్ఎస్ ఈవీ కారును లాంచ్ చేయడంలో ఎలక్ట్రిక్ వాహన విభాగంలోకి అడుగుపెట్టింది. అప్పటి నుంచి ఈ సంస్థ ఒక లక్ష కంటే ఎక్కువ ఈవీలను విక్రయించి, అమ్మకాల్లో సరికొత్త మైలురాయిని చేరుకున్నట్లు JSW MG మోటార్ ఇండియా ప్రకటించింది. ప్రారంభంలో జెడ్ఎస్ ఈవీను లాంచ్ చేసిన.. ఎంజీ మోటార్ కంపెనీ, ఇప్పుడు కామెట్ ఈవీ, విండ్సర్ ఈవీలను లాంచ్ చేసి, మార్కెట్లో విక్రయిస్తోంది. ఇవి కూడా ప్రతి నెలా ఉత్తమ అమ్మకాలను పొందుతున్నాయి. కంపెనీ మొత్తం అమ్మకాల్లో.. ప్రస్తుతం 7080 శాతం ఎలక్ట్రిక్ వాహనాలే ఉన్నాయని సంస్థ స్పష్టం చేసింది. భారతదేశ ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్లో 26 శాతం వాటాను కలిగిన ఎంజీ మోటార్ 2024 చివరి నాటికి 34 శాతానికి పెరిగింది. కాగా కంపెనీ 2025 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 26640 ఎలక్ట్రిక్ కార్లను విక్రయించింది. ఇది అంతకు, ముందు సంవత్సరంతో పోలిస్తే 220 శాతం ఎక్కువ కావడం గమనార్హం. ఎంజీ మోటార్ ఎలక్ట్రిక్ వాహన విభాగంలో.. జెడ్ఎస్ ఈవీ, కామెట్ ఈవీ, విండ్సర్ ఈవీ వంటివి మాత్రమే కాకుండా, ఎం9 అనే ప్రీమియం ఎంపీవీ కూడా ఉంది. దీని ప్రారంభ ధర రూ. 69.90 లక్షలు (ఎక్స్ షోరూమ్). ధర కొంత ఎక్కువగా ఉండటం వల్ల అమ్మకాలను ఇది దోహదపడనప్పటికీ.. లగ్జరీ ఎలక్ట్రిక్ కారు కావాలనుకునే వారికి ఇది మంచి ఎంపిక అవుతుంది.

# రష్యా నుంచి క్రూడాయిల్ దిగుమతులు తగ్గుముఖం!

దేశీయ చమురు శుద్ధి కర్మాగారాలకు ప్రధాన ముడిచమురు సరఫరాదారుగా ఉన్న రష్యా నుంచి భారత్ దిగుమతులు ఇటీవలికాలంలో గణనీయంగా తగ్గాయి. సెప్టెంబర్ నెలలో రష్యా నుంచి క్రూడాయిల్ దిగుమతులు విలువ పరంగా 28.9 శాతం తగ్గి, 2024 సెప్టెంబర్‌లోని 4,675 మిలియన్ డాలర్ల నుంచి 3,322 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వాల్యూమ్ పరంగా చూస్తే ఈ దిగుమతులు ఏకంగా 17 శాతం తగ్గి 6.6 మిలియన్ టన్నులకు చేరాయి.

**తగ్గుదలకు ప్రధాన కారణాలు**

రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోలు చేస్తున్న కారణంగా అమెరికా జులైలో ఇండియాపై 25 శాతం అదనపు టారిఫ్‌ను విధించింది. అంతకుముందు ఉన్న టారిఫ్‌లతో కలిపి ఇది మొత్తం సుమారు 50 శాతానికి చేరింది. ఈ అదనపు టారిఫ్‌ల వల్ల భారతీయ ఎగుమతులపై ముఖ్యంగా జౌళి (టెక్స్‌టైల్స్), ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాలపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో అమెరికా మార్కెట్లలో భారతీయ ఉత్పత్తులు ధరల పరంగా తమ పోటీతత్వాన్ని కోల్పోయాయి.



దిగుమతులు తగ్గించుకుంటేనే..

రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించుకుంటే ఈ టారిఫ్‌లను ఉపసంహరిస్తామని అమెరికా ప్రభుత్వం పరోక్షంగా ఒత్తిడి తీసుకొచ్చింది. దాంతో భారతీయ చమురు సంస్థలు (రిఫైనరీలు) ప్రత్యామ్నాయాల వైపు దృష్టి సారించక తప్పలేదు.

**రష్యా చమురు సంస్థలపై ఆంక్షలు**

అమెరికా ప్రభుత్వం ఇటీవల రష్యాకు చెందిన ప్రధాన చమురు సంస్థలు అయిన రోస్‌నెఫ్ట్, లుకోయిల్ వంటి వాటిపై ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు కేవలం టారిఫ్‌లు వంటి ధరల పెరుగుదలకు మాత్రమే పరిమితం కాకుండా ఈ సంస్థలతో ఆర్థిక లావాదేవీలు జరపడం, బీమా (ఇన్సూరెన్స్), రవాణా (షిప్పింగ్) వంటి అంశాలలో భారీ నియంత్రణ సమస్యలను సృష్టిస్తున్నాయి. పాశ్చాత్య ఆంక్షలకు లోబడి పనిచేయడం రిఫైనరీలకు సంక్లిష్టంగా మారడంతో భవిష్యత్తులో సరఫరా భద్రత దృష్ట్యా కొన్ని భారతీయ రిఫైనరీలు (రిలయన్స్ ఇండస్ట్రీస్, మాంగళూరు రిఫైనరీ వంటివి) రష్యా నుంచి కొత్త కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తుంది. దీన్ని కంపెనీలు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ఎనర్జీ సెక్యూరిటీ, జాతీయ ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని వాదిస్తూ భారత్ రష్యా నుంచి చౌకగా లభించిన ముడిచమురును పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుంది. అయినప్పటికీ అంతర్జాతీయ వాణిజ్యంపై అమెరికా విధించిన భారీ టారిఫ్‌లు, రష్యన్ సంస్థలపై ఆంక్షలు భారతీయ ఎగుమతి రంగంపై తీవ్ర ప్రభావం చూపడంతో దేశీయ రిఫైనరీలు తమ చమురు వనరుల కోసం ప్రత్యామ్నాయ దేశాలైన అమెరికా, మధ్య ఆసియా దేశాల వైపు మళ్ళక తప్పని పరిస్థితి ఏర్పడింది.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## ప్రేమించ లేదని బాలికపై కాల్పులు : సీసీటీవీలో రికార్డ్



దేశ రాజధాని నగరం ఢిల్లీ సరిహద్దు సమీపంలో హర్యానాలో పట్టపగలే నడిరోడ్డుపై దారుణం చోటు చేసుకుంది. ప్రేమను తిరస్కరించిందనే అక్కసుతో కోచింగ్‌నుంచి తిరిగి వస్తున్న అమ్మాయిపై కాల్పులు జరిపాడో యువకుడు. ఈ సంఘటన సీసీటీవీలో రికార్డైంది. దీని ఆధారంగా నిందితుడిని జతిన్ మంగ్లాగా గుర్తించారు పోలీసులు. హర్యానాలోని ఫరీదాబాద్ జిల్లాలోని బల్లభ్‌గఢ్‌లో సోమవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. 17 ఏళ్ల బాలికపై ఓ యువకుడు కాల్పులు జరిపాడు. ప్రేమను తిరస్కరించడంతోనే ఈ దారుణానికి పాల్పడినట్టు ప్రాథమిక దర్యాప్తు ద్వారా తెలుస్తోంది. జతిన్ మంగ్లాగా గత కొన్ని రోజులగా ఈ అమ్మాయిని వేధిస్తున్నాడు. దీనిపై కాల్పులకు ఒకరోజు ముందు తమ తల్లి దండ్రులు వేధిస్తున్నాడని నింధితుడి తల్లికి ఫిర్యాదు చేసిందనీ, ఆ మర్నాడే ఈ దురాగతానికి పాల్పడ్డాడని బాధితురాలి సోదరి వాపోయింది. అయితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటే అతడి తల్లి వేడుకుందని అందుకే ఊరుకున్నామని తెలిపింది. ఒక బుల్లెట్ భుజంపైకి,మరొక బుల్లెట్ ఆమె పొత్తికడుపులోకి దూసుకెళ్లింది. ఆమె నొప్పితో విలవిల్లాడుతూ కేకలు వేస్తుండగా, నిందితుడు తన బ్యాగ్ తీసుకొని అక్కడినుంచి ఉడాయించాడు. ఆ తరువాత స్నేహితులు తిరిగి ఆమె వద్దకు వచ్చి స్థానికుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నామని, బాలిక నిందితుడిని గుర్తించిందని పోలీసులు తెలిపారు. తన సోదరి బోర్డు పరీక్షలకు సిద్ధమవుతోందని, రోజూ అదే మార్గంలో కోచింగ్ నుండి ఇంటికి తిరిగి రావడం గమనించి, జతిన్ కొన్ని రోజులుగా తనను వెంబడించి, దాడి చేశాడని బాధితురాలి సోదరి తెలిపిందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రస్తుతం నింధితుడి కోసం గాలిస్తున్నామన్నారు.



## ఫిజిక్స్‌వాలాపై ఎఫ్ఐఆర్..

**న్యూఢిల్లీ:** ఎడ్‌టెక్ కంపెనీ 'ఫిజిక్స్‌వాలా' చిక్కుల్లో పడింది. ఈ కంపెనీ రూపొందించిన ఒక ప్రకటన.. కశ్మీర్‌లోని పర్యావరణాన్న దెబ్బతీసేవిధంగా ఉందనే ఆరోపణలు వచ్చాయి. బారాముల్లాలోని గుల్మార్గ్ సమీపంలోని బాదర్‌కోట్ అడవుల గుండా "ఫిజిక్స్‌వాలా" అధ్యాపకులు స్కార్పియో వాహనాల్లో వెళుతున్నట్లు చూపిన ఈ ప్రకటన పోలీసు దర్యాప్తుకు దారితీసింది. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గుల్మార్గ్ ఇఫ్తిఖర్ అహ్మద్ ఖాద్రీ ఫిర్యాదు మేరకు టాంగ్‌మార్గ్ పోలీస్ స్టేషన్‌లో 'ఫిజిక్స్‌వాలా'పై ఎఫ్ఐఆర్ దాఖలైంది. రిజిస్ట్రేషన్ ప్లేట్లు లేని ఆరు నల్ల స్కార్పియో వాహనాల్లో 'ఫిజిక్స్‌వాలా' అధ్యాపకులు అక్రమంగా అడవిలోకి ప్రవేశిస్తున్నట్లు చూపించే ఈ యూట్యూబ్ వీడియోపై ఫిర్యాదు నమోదయ్యింది. 9 నుండి 12 తరగతుల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఫిజిక్స్‌వాలా ఈ ఫుటేజ్ ఉపయోగించింది. ఈ చర్య భారత అటవీ చట్టం 1927, అటవీ సంరక్షణ చట్టం 1980కు విఘాతం కలిగించేలా ఉంది. 'ఫిజిక్స్‌వాలా' పై అటవీ అధికారి చేసిన ఫిర్యాదులో ఆ వాహనాలను పచ్చని పచ్చిక బయళ్లపై నడిపి, మూలికలు, వృక్షజాలానికి నష్టం కలిగించారని ఆరోపించారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ న్యాయ సంహిత నిబంధనల కింద.. 'ఫిజిక్స్‌వాలా' ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించినందంటూ కేసు నమోదు చేశారు. 20 రోజుల క్రితం జమ్ముకశ్మీర్‌లోని బుద్గాం పర్యావరణ వ్యవస్థను దెబ్బతీసినందుకు పలువురు యూట్యూబర్లపై కేసు నమోదయ్యింది. వారు పచ్చిక బయళ్ల గుండా డ్రైవింగ్ చేస్తున్నట్లు వెల్లడయ్యింది. దీంతో డిప్యూటీ కమిషనర్ బిలాల్ మోహిదిన వారిపై ఎఫ్ఐఆర్‌కు ఆదేశించారు. ఈ కేసులపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## పరిశోధనల పరంపరలో భారత్ సరికొత్త శకం



పరిశోధన, అభివృద్ధి (R and D), ఆవిష్కరణల రంగంలో భారత్‌ను విశ్వ గురువుగా నిలబెట్టాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. దేశంలో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల కోసం రూ.1 లక్ష కోట్లతో ప్రత్యేక మూలనిధి(రిసెర్చ్, డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ ఫండ్ RDI)ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా ప్రైవేట్ రంగం పెట్టుబడులు, భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఈ నిధి ముఖ్య ఉద్దేశం. ఈ నిధి భారత్‌ను శాస్త్ర సాంకేతిక హబ్‌గా మార్చడంలో ఎలా ఉపయోగపడుతుందో, వివిధ రంగాలపై దీని ప్రభావం ఎలా ఉండబోతుందో అంచనావేద్దాం.

**తక్కువ వడ్డీలు**

రూ.1 లక్ష కోట్ల ఆర్అండ్‌డీ మూలనిధి భారత్‌ను అంతర్జాతీయ శాస్త్ర సాంకేతిక హబ్‌గా తీర్చిదిద్దడంలో కీలకమైన ఉత్ప్రేరకంగా పనిచేయనుంది. ఈ నిధి ద్వారా పరిశోధన ప్రాజెక్టులకు, ముఖ్యంగా 'హైరిస్క్, హైఇంపాక్ట్' (అధిక ప్రమాదం, అధిక ప్రభావం) కలిగిన డీప్‌టెక్ స్టార్టప్‌లకు దీర్ఘకాలికంగా తక్కువ లేదా సున్నా వడ్డీకి రుణాలు లభిస్తాయి. ప్రభుత్వ సంస్థలు అందించే గ్రాంట్‌లతో పోలిస్తే ఇది ప్రైవేట్ సంస్థలకు స్థిరత్వాన్ని ఇస్తుంది.


**ప్రైవేట్ పెట్టుబడుల ఆకర్షణ**

ఈ నిధులను నేరుగా పరిశ్రమలకు అందించకుండా సెకండరీ లెవల్ ఫండ్ మేనేజర్ల (NBFC వంటివి) ద్వారా మళ్లించడం వల్ల నిధుల వినియోగంలో పారదర్శకత పెరుగుతుంది. ఇది ప్రైవేట్ వెంచర్ క్యాపిటల్, ఇతర సంస్థాగత పెట్టుబడిదారులను ఆర్ అండ్ డీ రంగంలోకి మరింతగా ఆకర్షిస్తుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ రీసెర్చ్(పరిశోధనను సులభతరం చేయడం) లక్ష్యంగా ఆర్థిక నియంత్రణలు, విధానాల్లో సంస్కరణలు ప్రవేశపెట్టడం వల్ల ఆవిష్కరణలు వేగవంతమవుతాయి.

**మానవ వనరులు, ఉపాధిపై ప్రభావం**

పరిశోధనలపై పెట్టుబడి పెరిగినప్పుడు అది నేరుగా మానవ వనరుల అభివృద్ధి, ఉపాధి కల్పనపై ప్రభావాన్ని చూపుతుంది. ఆర్ అండ్ డీ కార్యకలాపాలు పెరగడం వల్ల సైంటిస్టులు, ఇంజినీర్లు, డేటా నిపుణులు, డీప్‌టెక్ డెవలపర్లు వంటి అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులకు డిమాండ్ పెరుగుతుంది. ఇది విదేశాలకు వెళ్లాలనుకునే భారతీయ మేధావులను దేశంలోనే నిలుపుకోవడానికి దోహదపడుతుంది. పరిశోధన ఆధారిత సంస్థలు, స్టార్టప్‌లు వృద్ధి చెందడం వల్ల ఉద్యోగుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచాల్సిన అవసరం ఏర్పడుతుంది. దీనివల్ల విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల మధ్య సహకారం పెరిగి ప్రామాణికమైన శిక్షణ, విద్య అందుబాటులోకి వస్తుంది. ఇటీవల STEM (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) విద్యలో మహిళల భాగస్వామ్యం (43%తో ప్రపంచ సగటు కంటే ఎక్కువ) గణనీయంగా పెరిగింది. ఈ నిధి మహిళా శాస్త్రవేత్తలకు, ఆవిష్కర్తలకు ఉపాధి అవకాశాల పరంగా కొత్త మార్గాలను తెరిచి సమ్మిళిత ఆవిష్కరణకు తోడ్పడుతుంది. ఈ నిధి మద్దతుతో డీప్‌టెక్ స్టార్టప్‌లు వేగంగా వృద్ధి చెందుతాయి. తద్వారా పరోక్షంగా సేల్స్, మార్కెటింగ్, తయారీ రంగాల్లోనూ వేలాది కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి.

## ప్రముఖ పారిశ్రామికవేత్త కన్నుమూత




ప్రముఖ వ్యాపార వేత్త, హిందుజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ పి హిందుజా (85) కన్నుమూశారు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన లండన్‌లో తుది శ్వాస విడిచారు. వ్యాపార వర్గాల్లో జీపీగా పేరుగాంచిన గోపీచంద్ హిందూజా బ్రిటన్‌లోని అత్యంత ధనవంతులైన వ్యాపారవేత్తలలో ఒకరు. ఆయనకు భార్య సునీత, కుమారులు సంజయ్, ధీరజ్ కుమార్తె రీటా ఉన్నారు. గోపీచంద్ మరణంపై పలువురు పారిశ్రామికవేత్తలు, వ్యాపార దిగ్గజాలు సంతాపం ప్రకటించారు. 1950లో కుటుంబ వ్యాపారంలోకి ప్రవేశించి కంపెనీని ఇండోమిడిల్ ఈస్ట్ ట్రేడింగ్ ఆపరేషన్ నుండి ఒక అంతర్జాతీయ కంపెనీగా మార్చడంలో ఘనత పొందారు. ప్రభావవంతమైన వ్యాపార కుటుంబంలోని రెండవ తరానికి ప్రాతినిధ్యం వహించిన గోపీచంద్ పి హిందూజా, తన అన్నయ్య శ్రీచంద్ పి హిందూజా మరణం తర్వాత, మే 2023లో బహుళజా సంస్థ హిందూజా గ్రూప్ బాధ్యతలు స్వీకరించారు. భారతదేశ స్వాతంత్ర్యానికి ముందు సాంప్రదాయ వ్యాపార కుటుంబంలో జన్మించిన గోపీచంద్ హిందూజా 1959లో తన వృత్తిపరమైన ప్రయాణాన్ని ప్రారంభించి, ముంబైలోని కుటుంబ సంస్థలో చేరారు. దశాబ్దాలుగా, ఒకప్పుడు ఇండోమిడిల్ ఈస్ట్ వాణిజ్య వ్యాపారాన్ని 30 కంటే ఎక్కువ దేశాలలో ఉనికితో ప్రపంచ పారిశ్రామిక సమ్మేళనంగా మార్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలో, గ్రూప్ బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎనర్జీ, ఆటోమోటివ్, మీడియా మరియు మౌలిక సదుపాయాలతో సహా అనేక రంగాలలోకి విస్తరించింది. 1984లో గల్ఫ్ ఆయిల్ , 1987లో అశోక్ లేలాండ్, భారతదేశంలో ప్రవాస భారతీయులు (NRIలు) చేసిన తొలి ప్రధాన పెట్టుబడులు ఆయన హయాంలో జరగడం విశేషం.

**హిందూజా గ్రూపు**

హిందూజా గ్రూప్‌ను 1919లో పరమానంద్ దీప్‌చంద్ హిందూజా స్థాపించారు, అతను సింధ్ (అప్పుడు అవిభక్త భారతదేశంలో, ఇప్పుడు పాకిస్తాన్‌లో ఉంది) నుండి ఇరాన్‌కు వెళ్లారు. ఆ తరువాత 1979లో తన స్థావరాన్ని ఇరాన్ నుండి లండన్‌కు మార్చింది. అప్పటినుంచి కంపెనీ ప్రపంచ విస్తరించింది. ప్రస్తుతం ముంబై ప్రధాన కార్యాలయం కలిగిన గ్రూప్ ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ వ్యాపార సామ్రాజ్యంతోపాటు, హిందూజా గ్రూపు రియల్ ఎస్టేట్ పోర్ట్‌ఫోలియోకు కూడా ప్రసిద్ధి చెందింది. దాని అత్యంత విలువైన ఆస్తులలో వైట్‌హాల్‌లోని ఓల్డ్ వార్ ఆఫీస్ భవనం. ఇది లండన్‌లోని చారిత్రాత్మక ల్యాండ్‌మార్క్. ఈ భవనాన్ని సెప్టెంబర్ 2023లో ప్రారంభించిన రాఫెల్స్ లండన్ హోటల్‌గా తిరిగి అభివృద్ధి చేశారు. అంతేకాదు గోపీచంద్ హిందూజా కుటుంబం UKలో అత్యంత ధనవంతులు కూడా. బిజినెస్‌లోనూ, దాతృత్వానికి చేసిన కృషికి అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు గోపీచంద్.

# 100 కోడిగుడ్లతో కొట్టించుకున్న స్టార్ హీరో.. ఒక్క మాట అనలేదు!



కొంతమంది హీరోలు పాత్ర డిమాండ్ చేస్తే ఎలాంటి సాహసాలు చేయడానికైనా రెడీ అవుతుంటారు. రిస్కీ షాట్స్ సైతం డూప్ లేకుండా ట్రై చేస్తుంటారు. స్టంట్స్ విషయంలోనూ వెనకడుగు వేయరు. ప్రేక్షకులను అలరించడానికి ఎంత కష్టమైన భరిస్తారు. అలాంటి హీరోల్లో బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ ఒకరు. ఎలాంటి పాత్రలోనైనా జీవించే గొప్ప నటుడు ఆయన. పాత్ర డిమాండ్ చేస్తే ఎలాంటి పని చేయడానికైనా రెడీ అవుతుంటాడు.

ఓ సినిమాలోని పాట కోసం ఏకంగా 100 కోడిగుడ్లతో కొట్టించుకున్నాడట. దుర్వాసన తో పాటు నొప్పి కలిగినా..ఒక్కమాట కూడా అనకుండా షూట్ అయ్యేవరకు అలాగే ఉండిపోయాడట. ఈ విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో కొరియోగ్రాఫర్ చిన్నిప్రకాశ్ చెప్పారు.

'అంకితభావంతో పనిచేసే అతికొద్ది మంది హీరోల్లో అక్షయ్ ఒకరు. పాత్ర కోసం వందశాతం కష్టపడతాడు. ఆయనతో నేను దాదాపు 50 పాటల వరకు కొరియోగ్రాఫర్‌గా పనిచేశాను. ఎలాంటి కష్టమైన స్టెప్పులు ఇచ్చినా..ట్రై చేసేవాడు. స్టెప్స్ మార్చమని ఎప్పుడూ అడగలేదు. 'ఖిలాడి' చిత్రంలో ఓ పాట కోసం అక్షయ్ 100 కోడిగుడ్లతో కొట్టించుకున్నాడు.

ఆ సీన్‌లో ఆయన చుట్టూ అమ్మాయిలు చేరి కోడిగుడ్లతో కొట్టాలి. ఈ విషయం చెప్పగానే వెంటనే చేసేద్దాం అని చెప్పాడు. అమ్మాయిలంతా కోడిగుడ్లని ఆయనపై విసిరేశారు. నొప్పి కలిగినా ఒక్క మాట కూడా అనలేదు. దుర్వాసన పోవడం కోసం చాలా కష్టపడ్డాడు. ఒక్కరిని కూడా కోపగించుకోలేదు. స్టార్ హీరో అయినప్పటికీ.. చాలా సింపుల్‌గా ఉంటాడు. అక్షయ్‌లా కష్టపడే నటీనటులను నేను ఇప్పటివరకు చూడలేదు' అని చిన్ని ప్రకాశ్ చెప్పుకొచ్చాడు. అబ్బాస్, మస్తాన్ దర్శకత్వంలో అక్షయ్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన 'ఖిలాడి' చిత్రం 1992లో విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది.

# మోహన్‌బాబు@50



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారు మంచు మోహన్‌బాబు. ఆయన స్వర్ణోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ఆయన తనయుడు విష్ణు మంచు ఈ నెల 22న 'ఎమ్‌బీ50– ఎ పెర్ల్ వైట్ ట్రిబ్యూట్' పేరుతో ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ''నాన్నగారు(మోహన్ బాబు) ఇండస్ట్రీలోకి వచ్చి ఈ ఏడాదితో 50 ఏళ్లు పూర్తయ్యాయి. ఐదు దశాబ్దాలుగా ఆయన ప్రేక్షకుల్ని అలరిస్తూనే ఉన్నారు. శక్తివంతమైన నటన, ఐకానిక్ డైలాగ్ డెలివరీ, తెరపై చూపించిన ప్రతిభ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుంటుంది. 600కి పైగా చిత్రాల్లో నటించారంటే ఆయన బహుముఖ ప్రజ్ఞ, క్రమశిక్షణ, కళ పట్ల అంకితభావాన్ని చాటుతాయి. కేవలం సినీ విజయాలే కాకుండా కళ, విద్య, దాతృత్వం పట్ల ఆయన చూపిన నిబద్ధత కూడా గొప్పది. ఎలాంటి సినిమా నేపథ్యం లేకపోయినా సినీ ప్రయాణం మొదలు పెట్టి.. తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని ఏర్పరచుకుని, విలక్షణ నటుడిగా ఎదిగిన ఈ ప్రయాణం గురించి మరోసారి చాటి చెప్పబోతున్నాం. 'ఎమ్‌బీ50– ఎ పెర్ల్ వైట్ ట్రిబ్యూట్' ఒక చారిత్రాత్మకమైన ఘట్టంగా అందరికీ గుర్తుండిపోయేలా ఈ వేడుక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం'' అని విష్ణు మంచు తెలిపారు.



# పాన్ ఇండియా చిత్రంగా కాళీమాతా

ప్రముఖ నిర్మాత, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి కొత్త సినిమాను ప్రకటించాడు. నిజ సంఘటనల ఆధారంగా 'కాళీమాతా' ని తెరకెక్కించబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ పొలిటికల్ థ్రిల్లర్ చిత్రానికి ఆయన కథను అందించడంతో పాటు నిర్మాతగానూ వ్యవహరిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ని ప్రకటిస్తూ ఓ గ్లింప్స్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ.. 'కాళీమాతా కేవలం సినిమా కాదు — ఇది ఒక ఉద్యమం.నిజ సంఘటనల స్ఫూర్తితో రూపొందుతున్న ఈ చిత్రం మతం, జాతి, భాష, ప్రాంతం అనే సరిహద్దులను దాటి — "సత్యానికి పాస్‌పోర్ట్ ఉండదు" అనే విశ్వసత్యాన్ని ప్రతిధ్వనింపజేస్తుంది. ఇది న్యాయం కోసం, సత్యం కోసం మానవత్వం చేసే ఆత్మపోరాటాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ చిత్రంలో పాన్ ఇండియా స్టార్స్ నటించబోతున్నారు. అలాగే ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు ఈ చిత్రంలో భాగమవుతున్నారు. ఒకేసారి తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, బెంగాలీ, ఒడియాతో పాటు పలు అంతర్జాతీయ భాషల్లోనూ విడుదల చేస్తాం. కాస్టింగ్‌తో పాటు పూర్తి వివరాలను త్వరలోనే తెలియజేస్తాం' అన్నారు.



# నాలుగు విభాగాల్లో మెరిసిన భ్రమయుగం..

## మమ్ముట్టి ఖాతాలో మరో రికార్డు!

మమ్ముట్టి నటన గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎలాంటి పాత్రల్లో అయినా ఆయన జీవించేస్తాడు. తెరపై స్టార్‌లా కాకుండా పాత్రకు తగ్గ నటుడిలాగానే కనిస్తాడు. ఆయన కెరీర్‌లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలు, సినిమాలు చేశారు. అందులో ఒకటి 'భ్రమయుగం'. గతేడాది విడుదలైన ఈ చిత్రం ఎన్ని రికార్డులకు క్రియేట్ చేసిందో అందరికి తెలిసిందే. భారీ వసూళ్లతో పాటు విమర్శకుల ప్రశంసలను దక్కించుంది. తాజాగా 55వ కేరళ రాష్ట్ర సినిమా అవార్డుల్లోనూ ఈ చిత్రం సత్తా చాటింది. నాలుగు ప్రతిష్ఠాత్మక విభాగాల్లో అవార్డులను సాధించింది.

ఉత్తమ నటుడిగా మమ్ముట్టి, ఉత్తమ సహాయ నటుడిగా సిద్ధార్థ్ భరతన్, ఉత్తమ నేపథ్య సంగీత దర్శకుడిగా క్రిస్టో జేవియర్, ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్‌గా రోనెక్స్ జేవియర్ అవార్డులు గెలుపొందారు. ఈ అవార్డుతో మమ్ముట్టి ఖాతాలో మరో అరుదైన రికార్డు నమోదైంది. రాష్ట్ర స్థాయిలో అత్యధిక సార్లు(7) ఉత్తమ నటుడి విభాగంలో అవార్డు అందుకున్న నటుడిగా మమ్ముట్టి రికార్డు సృష్టించారు.

భ్రమయుగంలో తాంత్రిక విద్యలు తెలిసిన కొడుమోన్ అనే పాత్రను మమ్ముట్టి పోషించారు. . ఈ పాత్రలో మమ్ముట్టి ఒదిగిపోయిన తీరు.. భారతదేశపు అత్యుత్తమ నటుల్లో ఒకరిగా ఆయన స్థాయిని పునరుద్ఘాటించింది. కొన్ని తరాలకు గుర్తుండిపోయే సరికొత్త ఆలోచనలతో, సృజనాత్మక సరిహద్దులను చెరిపివేసి.. మలయాళ సినిమా ఎలా ముందుకు వెళుతుందో చెప్పడానికి ఒక గొప్ప ఉదాహరణగా 'భ్రమయుగం' నిలిచింది. నిర్మాతలు రామచంద్ర చక్రవర్తి (నైట్ షిఫ్ట్ స్టూడియోస్), ఎస్. శశికాంత్ (వైనాట్ స్టూడియోస్) తమ సినిమా సృజనాత్మక దృష్టిని గుర్తించినందుకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం, జ్యూరీ, విమర్శకులు, మీడియా మరియు ప్రేక్షకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

"ఈ అవార్డులు ప్రయోగాత్మక కథలపై మా నమ్మకాన్ని మరింత బలపరిచాయి. మరిన్ని ప్రయోగాత్మక సినిమాలు చేయడానికి, కేరళ సినిమాకు కొత్త దారులు చూపే ప్రయత్నాలను కొనసాగించడానికి ఇవి మాకు ప్రేరణగా నిలుస్తాయి.
మా దర్శకుడు, నటీనటులు, సాంకేతిక బృందం మరియు ప్రేక్షకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు." అంటూ నిర్మాతలు తమ ఆనందాన్ని పంచుకున్నారు. గత సంవత్సరం విడుదలై విశ్వవ్యాప్త ప్రశంసలు అందుకున్న 'భ్రమయుగం' చిత్రానికి రాహుల్ సదాశివన్ రచన మరియు దర్శకత్వం వహించారు. మమ్ముట్టి, అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, అమల్దా లిజ్ వంటి అద్భుతమైన తారాగణం నటించారు.



# విజయ్ సేతుపతి కుమారుడి సినిమా.. అదిరిపోయేలా ట్రైలర్

విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతి హీరోగా వెండితెరపై ఎంట్రీ ఇచ్చేశాడు. అతను నటించిన తొలి సినిమా తమిళ్‌లో 'ఫీనిక్స్' పేరుతో ఇప్పటికే విడుదలైంది. అక్కడ ఫర్వాలేదనిపించిన ఈ మూవీ ఇప్పుడు ఇదే టైటిల్‌తో తెలుగులో కూడా రిలీజ్ కానుంది. ఈ క్రమంలో తాజాగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రముఖ స్టంట్ మాస్టర్ అనల్ అరసు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీని రాజ్యలక్ష్మి అనల్ అరసు నిర్మించారు. జూలై 4న తమిళ్‌లో విడుదలైన ఈ చిత్రం ఇప్పటికే అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే, తెలుగు వర్షన్ నవంబర్ 7న థియేటర్‌లో విడుదల కానుంది. ఈమేరకు హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను కూడా మేకర్స్ నిర్వహించారు. ఫీనిక్స్ సినిమాలో యాక్షన్‌తో పాటు అద్భుతమైన ఎమోషన్ కూడా సూర్య సేతుపతి పండిచాడు. వరలక్ష్మీ శరత్‌కుమార్ ఒక కీలకమైన పాత్రలో నటించారు. మీడియా సమావేశంలో విజయ్ సేతుపతి మాట్లాడుతూ.. తన కుమారుడు ఒక మంచి సినిమాతో తెలుగులో పరిచయం అవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఎమోషనల్ అండ్ హై యాక్షన్ స్టోరీతో సినిమా తీశామని తెలుగు ప్రేక్షకులను మెప్పిస్తుందని ఆయన తెలిపారు.



# స్టెప్పులు అదుర్స్

ఫుల్ ఎనర్జీతో అదిరిపోయే స్టెప్పులు వేస్తున్నారు రవితేజ. ఆయన హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఆషికా రంగనాథ్ హీరోయిన్ . ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. కాగా, ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో జరుగుతోంది. ప్రత్యేకంగా వేసిన సెట్‌లో శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో రవితేజ– ఆషికలపై అదిరిపోయే పాటని చిత్రీకరిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. "ఈ సినిమాలో రవితేజ న్యూ స్టైలిష్ లుక్‌లో కనిపిస్తారు. హ్యూమర్, ఎమోషన్ , రవితేజ మార్క్ ఎనర్జీతో పాటుగా, మంచి ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రం ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అని యూనిట్ పేర్కొంది. రవితేజ కెరీర్‌లోని ఈ 76వ సినిమాకు 'అనార్కలి, రోల్ మోడల్, భర్త మహాశయులకు విజ్ఞప్తి' వంటి టైటిల్స్ పరిశీలనలో ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాకు సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com